VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శుక్రవారం 12.06.2026

సంపుటి : 08 సంచిక : 03 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



ఢిల్లీ వెలుతురు జూన్ 11: కేంద్ర విద్యుత్, గృహనిర్మాణ & పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

# రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

## ప్రధాని నరేంద్ర మోడీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి



11

**ఢిల్లీ వెలుతురు జూన్ 11:**

తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని వివరించారు.హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్–2 విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఫేజ్–2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు ₹38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు వివరించారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు.హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని, ఎన్‌హెచ్ఏఐకి ₹626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు.ట్రిపుల్ ఆర్‌లో దక్షిణ భాగం నిర్మాణం కూడా అంతే కీలకమని ముఖ్యమంత్రి వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని చెప్పారు. ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# రైతన్నలారా..... ఇకనైనా మారండి

- రసాయన ఎరువులను వాడకండి
- ఆ పంటలను కొని రోగాలను కొని తెచ్చుకుంటున్నాం
- ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లండి
- ముందుగా సేంద్రీయ సాగు చేసే వాళ్లు కోటీశ్వరులు కావొచ్చు



6

# కాంగ్రెస్‌లోకి టీఎంసీ విలీనం వార్తలకు చెక్

- 'ఇండియా' కూటమి బలోపేతమే చర్చల అజెండా: కేసీ వేణుగోపాల్
- టీఎంసీ కాంగ్రెస్‌లో విలీనం కానుందన్న ప్రచారాన్ని ఖండించిన ఏఐసీసీ



2

# టీఆర్ఎస్ పేరుపై బీఆర్ఎస్ పంచాయతీ

- కేంద్ర ఎన్నికల సంఘానికి గులాబీ పార్టీ ఫిర్యాదు.. ఆ పేరు ఎవరికీ ఇవ్వద్దని విజ్ఞప్తి
- కవిత నేతృత్వంలోని 'తెలంగాణ రక్షణ సేన' పొలిటికల్ ఎంట్రీపై అభ్యంతరం
- తెలంగాణ సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న పేరును కాపాడుకునేందుకు పోరాటం
- ఇప్పటికీ ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ అంటే టీఆర్ఎస్ పార్టీయేనని ఈసీఐకి వివరించిన శ్రేణులు
- ఒక్క రోజు ముందే రంగంలోకి దిగిన మహారాష్ట్ర షోలాపూర్ నేతలు.. సరికొత్త పేరుతో దరఖాస్తు
- 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' పేరు కోసం ఎలక్షన్ కమిషన్‌ను ఆశ్రయించిన దయానంద్



11

- ఈసీఐ నిబంధనల ప్రకారం అభ్యంతరాల స్వీకరణ కోసం అధికారిక నోటిఫికేషన్ విడుదల
- టీఆర్ఎస్ పేరు తమదేనంటూ గళమెత్తిన మరొక పొలిటికల్ పార్టీ 'తెలంగాణ రాజ్య సమితి'
- సరికొత్త వివాదంలోకి 'టి.ఆర్.ఎస్' మూడు అక్షరాలు.. ఈసీ నిర్ణయంపై సర్వత్రా ఉత్కంఠ

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత సెంటిమెంట్‌తో కూడుకున్న టీఆర్ఎస్ అనే మూడు అక్షరాల పేరు ఇప్పుడు సరికొత్త వివాదానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కవిత నేతృత్వంలో కొత్తగా రాబోతున్న రాజకీయ పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పేరుపై భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

# రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు

- ప్రజలకు గౌరవప్రదమైన సేవలే లక్ష్యం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**



11

రాష్ట్రంలో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలనే లక్ష్యంతో ఆర్డీవో, తహసీల్దార్ మరియు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార & పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ భవనాలను హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. గురువారం సచివాలయంలో తన కార్యాలయంలో రెవెన్యూ, హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రిగారు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో రెవిన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్& రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ సెక్రటరీ వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక విధానాలతో సామాన్యుడిపై భారం

- కేంద్ర ప్రభుత్వ తీరుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు



9

- పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వ్యాఖ్య

# ఎస్ఐఆర్‌పై అపోహలు సృష్టిస్తున్నారు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- గతంలో మద్దతిచ్చిన ప్రతిపక్షాలు ఇప్పుడు విమర్శలు
- రాజకీయ ప్రయోజనాల కోసమే బీజేపీపై ఆరోపణలు
- ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎస్ఐఆర్ అవసరం



11

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నల్లగొండ జిల్లా పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి - మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- ఈనెల 17న ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టరేట్లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి

**నల్లగొండ వెలుతురు జూన్ 11:**

సుమారు 14,500 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్ల శంకుస్థాపన నిమిత్తం ఈ నెల 17 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి గారు నల్గొండ జిల్లా, కనగల్ వస్తున్న దృష్ట్యా రాష్ట్ర ముఖ్యమంత్రి రాకకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ▶ మిగతా 11లో

# ఫ్యూచర్ సిటీని రద్దు చేసి తీరుతాం: మాజీ మంత్రి హరీశ్ రావు



9

- రైతుల భూములను రియల్ ఎస్టేట్ కోసం వినియోగించడాన్ని అంగీకరించబోమన్న హరీశ్‌రావు

# హుస్నాబాద్ బస్టాండ్‌ను షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తాం: మంత్రి పొన్నం

- 2027 గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళిక
- హుస్నాబాద్ అభివృద్ధికి డ్రైనేజీ వ్యవస్థ విస్తరణ
- ఆర్టీసీ ఎండీతో కలిసి బస్టాండ్ పరిశీలన
- ప్రయాణికులతో మాట్లాడి సమస్యలపై ఆరా
- ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలతో అభివృద్ధి వేగం



11

# బెంగాల్‌లో తృణమూల్ విచ్ఛిన్నం?

- వారంలో ముగ్గురు రాజ్యసభ ఎంపీల రాజీనామా
- కాంగ్రెస్‌లో విలీనానికి మమతా బెనర్జీ మొగ్గు
- సుఖేందు శేఖర్, సుష్మితా దేవ్‌ల బాటలోనే ఎంపీ ప్రకాశ్ చిక్
- రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు అధికారికంగా రాజీనామా సమర్పన
- అసోం సీఎం హిమంత బిశ్వశర్మతో సుష్మితా దేవ్ అత్యవసర భేటీ
- ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలంటూ స్పీకర్‌కు లేఖ రాసిన 20 మంది టీఎంసీ ఎంపీలు
- తిరుగుబాటుదారుల జాబితాలో మాజీ క్రికెటర్ యూసుఫ్ పఠాన్
- అదే దారిలో సినీ నటుడు శత్రుఘ్న సిన్హా, సయోనీ ఘోష్
- సొంత పార్టీలోనే పెరిగిన ముఠా ముఠా తగాదాలు
- దీదీ చేజారుతున్న బెంగాల్ రాజకీయ కోట
- మనుగడ కోసం కాంగ్రెస్ పార్టీలో విలీనానికి సిద్ధమవుతున్న టీఎంసీ
- రాహుల్ గాంధీతో గంటన్నర పాటు సుదీర్ఘంగా మంతనాలు జరిపిన అభిషేక్ బెనర్జీ

**పశ్చిమ బెంగాల్ వెలుతురు జూన్ 11:**

పశ్చిమ బెంగాల్ అధికార పార్టీ అయిన తృణమూల్ కాంగ్రెస్‌లో (టిఎమ్‌సి) ఊహించని విధంగా రాజకీయ సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. ఆ పార్టీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి సొంత నేతలే వరుసగా షాక్‌ల మీద షాక్‌లు ఇస్తున్నారు. పార్టీ అంతర్గత పరిణామాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ఎంపీలు ఒక్కొక్కరుగా తృణమూల్‌ను వీడుతున్నారు. తాజాగా ఆ పార్టీకి చెందిన మరో కీలక నేత ప్రకాశ్ చిక్ తన రాజ్యసభ సభ్యత్వానికి అధికారికంగా రాజీనామా చేశారు. ఈ ఒక్క వారంలోనే ఏకంగా ముగ్గురు సీనియర్ రాజ్యసభ ఎంపీలు తృణమూల్ కాంగ్రెస్‌కు రాంరాం చెప్పడం జాతీయ రాజకీయాల్లో పెద్ద సంచలనంగా మారింది.తృణమూల్ కాంగ్రెస్ తరపున పెద్దల సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రకాశ్ చిక్ తన రాజీనామా లేఖను రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు స్వయంగా సమర్పించారు. పార్టీ లీడర్‌షిప్ వ్యవహరిస్తున్న తీరు నచ్చకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు చెప్తున్నాయి. కేవలం ఈ ఒక్క వారంలోనే ముగ్గురు ఎంపీలు టీఎంసీని వీడటంతో పార్టీ పార్లమెంటరీ బలం ఒక్కసారిగా పడిపోయింది. ఈ నెల 8వ తేదీన సీనియర్ నేత సుఖేందు శేఖర్ రాయ్, ఆ తర్వాత 10వ తేదీన మహిళా నేత సుష్మితా దేవ్ తమ రాజ్యసభ సభ్యత్వంతో పాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రకాశ్ చిక్ కూడా వారి బాటలోనే పయనించారు.రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన వెంటనే మహిళా నేత సుష్మితా దేవ్ తన తదుపరి రాజకీయ అడుగులను వేగవంతం చేశారు. ఆమె అసోం ముఖ్యమంత్రి, ఈశాన్య రాష్ట్రాల బీజేపీ పర్యవేక్షకుడు హిమంత బిశ్వశర్మతో ప్రత్యేకంగా భేటీ కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. తృణమూల్‌లో ఊపిరాడకుండా పోయిందని, బెంగాల్ వెలుపల పార్టీని విస్తరించడంలో మమతా బెనర్జీ ఘోరంగా విఫలమయ్యారని ఆమె ఆరోపిస్తున్నారు. సీఎం హిమంతతో జరిగిన ఈ భేటీ నేపథ్యంలో సుష్మితా దేవ్ త్వరలోనే అధికారికంగా కాషాయ జెండా కప్పుకుని బీజేపీలో చేరడం దాదాపు ఖాయమైందని ప్రచారం సాగుతోంది.తృణమూల్ కాంగ్రెస్‌కు కేవలం రాజ్యసభలోనే కాకుండా, లోక్‌సభలోనూ ఊహించని పెద్ద తిరుగుబాటు ఎదురైంది. ఆ పార్టీకి చెందిన ఏకంగా 20 మంది లోక్‌సభ ఎంపీలు



పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా గళం విప్పారు. తమను తృణమూల్ కాంగ్రెస్ అధికారిక సభ్యులుగా కాకుండా, లోక్‌సభలో ఒక 'ప్రత్యేక గ్రూపు'గా గుర్తించాలంటూ లోక్‌సభ స్పీకర్‌కు సంయుక్తంగా ఒక లేఖ రాయడం బెంగాల్ రాజకీయాల్లో భూకంపం సృష్టించింది.

మమతా బెనర్జీ మరియు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీల ఒంటెద్దు పోకడలకు నిరసనగానే ఈ సంక్షోభం తలెత్తిందని తెలుస్తోంది.స్పీకర్‌కు లేఖ రాసిన ఆ 20 మంది అసమ్మతి ఎంపీల జాబితాలో దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న పలువురు ప్రముఖ సెలబ్రిటీలు, ప్రజాప్రతినిధులు ఉండటం గమనార్హం. భారత మాజీ స్టార్ క్రికెటర్ యూసుఫ్ పఠాన్, ప్రముఖ సినీ నటుడు శత్రుఘ్న సిన్హా, యువ నటి సయోనీ ఘోష్ వంటి స్టార్ ఎంపీలు ఈ తిరుగుబాటు గ్రూపులో ఉన్నట్లు గట్టిగా తెలుస్తోంది. పార్టీలో సీనియర్లకు కనీస గౌరవం దక్కడం లేదని, అంతా అభిషేక్ బెనర్జీ కనుసన్నల్లోనే నడుస్తోందని

ఈ సెలబ్రిటీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. వీరంతా ఒకేసారి పార్టీకి గుడ్ బై చెబితే బెంగాల్ లో మమతా సర్కార్ మనుగడ కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉంది.గత కొన్ని నెలలుగా పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అంతర్గత ముఠా తగాదాలతో అట్టుడుకుతోంది. ఒకవైపు మమతా బెనర్జీని నమ్ముకున్న పాత తరం సీనియర్ నాయకులు, మరోవైపు ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీని సమర్థిస్తున్న కొత్త తరం యువ నేతల మధ్య తీవ్రస్థాయిలో కోల్డ్ వార్ సాగుతోంది. ఈ అంతర్గత విభేదాల వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ పూర్తిగా నలిగిపోతోంది. దీనికి తోడు అవినీతి ఆరోపణలు, కేంద్ర దర్యాప్తు సంస్థల సోదాలతో పార్టీ ఇమేజ్ డ్యామేజ్ అవుతుండటంతో, భవిష్యత్తును వెతుక్కుంటూ ఎంపీలు, ఎమ్మెల్యేలు పక్క చూపులు చూస్తున్నారు.సొంత పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున తిరుగుబాటు జెండా ఎగరేయడంతో.. రాజకీయంగా మనుగడ సాగించడం కోసం మమతా బెనర్జీ ఒక సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారనే వార్తలు ఢిల్లీ వేదికగా బలంగా వినిపిస్తున్నాయి. తృణమూల్ కాంగ్రెస్ పార్టీని పూర్తిగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) లో విలీనం చేసేందుకు చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం జోరందుకుంది.

ఒంటరిగా ఉండి బీజేపీ చేతిలో దెబ్బతినడం కంటే, కాంగ్రెస్‌తో కలిసిపోయి బెంగాల్ లో తన పట్టును నిలుపుకోవడమే మంచిదనే ప్లాన్ లో మమతా బెనర్జీ ఉన్నట్లు పొలిటికల్ విశ్లేషకులు భావిస్తున్నారు.ఈ విలీన ప్రచారానికి బలం చేకూరుస్తూ ఢిల్లీలో అత్యంత కీలకమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ రహస్యంగా సమావేశం కావడం దేశవ్యాప్తంగా పెద్ద హాట్ టాపిక్ అయ్యింది. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ సుదీర్ఘ సమావేశంలో విలీనానికి సంబంధించిన నిబంధనలు, భవిష్యత్తు కార్యాచరణపై ఇరు నేతలు లోతుగా చర్చించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత్రి సోనియా గాంధీతో మమతా బెనర్జీ భేటీ అయిన మరుసటి రోజే.. రాహుల్, అభిషేక్‌లు సమావేశం కావడం చూస్తుంటే బెంగాల్ రాజకీయాల్లో త్వరలోనే ఒక పెద్ద చారిత్రాత్మక మార్పు రాబోతోందని స్పష్టమవుతోంది.

# దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

- నీతి ఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టీకరణ
- కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనా వివరించిన సీఎం
- విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరం
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడి
- దేశంలో ఏ రాష్ట్ర సీఎం, అధికారులు యంగ్ ఇండియా స్కూల్స్ ను చూడాలనుకున్నా--- సంతోషంగా చూపిస్తాం.

**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 11:**

దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాదని నీతి ఆయోగ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కులగణన తర్వాత తెలంగాణ అభివృద్ధి నమూనాను నీతి ఆయోగ్ లో ఆయన వివరించారు. విద్యా విప్లవం, నైపుణ్యాభివృద్ధి, ప్రపంచ స్థాయి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి అవసరమని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్న వికసిత్ భారత్–2047 లక్ష్యాన్ని సాధించాలన్నా, దేశంలోని ప్రతి విద్యార్థికి, పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని చెప్పారు. గురువారం రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... దేశ అభివృద్ధి అంటే ప్రజల అభివృద్ధేనని గుర్తు చేశారు. ప్రజలను ఆర్థిక శక్తులుగా, దేశ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో విద్య, ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తాయని సీఎం చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (SEEEPC)లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయని సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 3.55 కోట్ల మంది, 242 కులాలకు చెందిన ప్రజల వివరాలను సేకరించిన ఈ సర్వేలో పైసలు, భూమి కంటే విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేస్తున్న ముఖ్యమైన అంశంగా తేలిందని చెప్పారు. అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య అందించడం ద్వారా మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చని స్పష్టం చేశారు.

### తెలంగాణలో విద్యా-నైపుణ్యాభివృద్ధి విప్లవం

విద్యాశాఖను తన వద్దే ఉంచుకోవడానికి కారణం విద్యపై తనకు ఉన్న నమ్మకమేనని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. గడచిన 75 ఏండ్లలో మనమంతా ఉచిత విద్య అందించేందుకు ప్రయత్నం చేశామని, కానీ నాణ్యమైన విద్యను అందించడం మనకు ఒక సవాలుగా మారిందన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, పాఠశాల బస్సులు, క్రీడా సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే క్యాంపస్‌లో చదివే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వం నిర్మించే యంగ్ ఇండియా స్కూల్స్ కులాల మధ్య గోడలు కూల్చివేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజంలో సమానత్వం పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని వర్గాల పిల్లలు కలిసి చదువుకోవడం, కలిసి జీవించడం ద్వారా కుల వివక్ష తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

కాగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. దేశంలో ఏ రాష్ట్రానికి చెందిన ముఖ్యమంత్రి అయినా--- అధికారులైనా తమ రాష్ట్రంలోని యంగ్




ఇండియా స్కూల్స్ చూడాలంటే తాము సంతోషంగా చూపిస్తామని చెప్పారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగంలో యువతకు కొత్త నైపుణ్యాలు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తయారీ రంగం, సేవారంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైల్వే, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. యువతకు ప్రపంచ స్థాయి శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ మహీంద్రా, శ్రీనిరాజు వంటి కార్పొరేట్ దిగ్గజాలు ఈ యూనివర్సిటీ నిర్వహణలో భాగస్వాములుగా ఉన్నారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు టాటా గ్రూప్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని సీఎం తెలిపారు. ఈ ప్రాజెక్టులో టాటా సంస్థ రూ.2,100 కోట్ల పెట్టుబడి పెడుతుందన్నారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం చెప్పారు.

ఉన్నత విద్య, పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ కేంద్రంగా మారుతోందన్నారు. ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, ఐఎస్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఉన్నాయని, హైదరాబాద్‌కు ఐఐఎం కూడా రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఈ దిశగా యూనివర్సిటీ ఆఫ్ లండన్ హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్ ఏర్పాటు చే యడం తొలి విజయమని వివరించారు. దేశ ఆర్థికాభివృద్ధికి ప్రధాన ఇంజిన్లుగా ఉన్న ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి కార్యాలయం ఆధ్వర్యంలో 'ఎం–6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. ఈ నగరాల అభివృద్ధి కోసం రూ.6 లక్షల కోట్ల ప్రత్యేక నిధిని కేటాయించాలని కోరారు. ఒక్కో నగరానికి రూ.1 లక్ష కోటి చొప్పున మౌలిక వసతుల అభివృద్ధికి అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరుతూ సీఎం పలు ప్రతిపాదనలు చేశారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు మద్దతు, హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు వంటి అంశాల్లో సహకారం అందించాలని కోరారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా భారత్ అవతరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌లోకి టీఎంసీ విలీనం వార్తలకు చెక్

- మమతా బెనర్జీ పార్టీతో విలీనంపై ఎలాంటి చర్చలు జరగలేదన్న వేణుగోపాల్
- 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం చేయడంపైనే దృష్టి పెట్టిన ప్రతిపక్షాలు
- మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల వ్యవహారంపై కేంద్రంపై కాంగ్రెస్ ఆగ్రహం
- నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యానికి విఘాతమని విమర్శలు
- ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను బీజేపీలో చేర్చుకోవడం సీట్ల దోపిడీతో సమానమన్న కాంగ్రెస్
- జూన్ నెలాఖరు నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతున్న హస్తం పార్టీ
- ధరల పెరుగుదల, ఆర్థిక సమస్యలపై కేంద్రాన్ని నిలదీయనున్న కాంగ్రెస్
- రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాటం కొనసాగుతుందన్న పార్టీ అధిష్ఠానం
- మీనాక్షీ నటరాజన్ పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్న సుప్రీంకోర్టు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**

కాంగ్రెస్‌లోకి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) విలీనం కానుందంటూ ఇటీవల రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగింది. అయితే ఈ వార్తలను కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా ఖండించింది. అలాంటి ప్రతిపాదన గానీ, చర్చలు గానీ ఎక్కడా జరగలేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ప్రతిపక్షాల ఐక్యతను మరింత బలోపేతం చేయడమే ప్రస్తుతం తమ ప్రధాన లక్ష్యమని, 'ఇండియా' కూటమి భవిష్యత్ కార్యాచరణపైనే చర్చలు జరిగాయని ఆయన స్పష్టం చేశారు.ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం కీలక సమావేశం నిర్వహించింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జీలు, పీసీసీ అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షీ నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో బీజేపీ మద్దతు ఉన్న అభ్యర్థి నామినేషన్ ఆమోదం పొందడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించే పరిణామమని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఈ అంశాన్ని రాజకీయంగానే కాకుండా న్యాయపరంగానూ సవాలు చేస్తామని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు.ఇతర పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి అధికార పార్టీలో చేర్చుకోవడం ప్రజల తీర్పును అవమానించడమేనని ఆయన ఆరోపించారు. అలాంటి చర్యలు 'సీటు చోరీ'తో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే ఈ ధోరణికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.జూన్ నెలాఖరు నుంచి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆందోళన కార్యక్రమాలను ప్రారంభించనుంది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఆర్థిక మందగమనం, విద్యా రంగంలో సమస్యలు, పరీక్షల నిర్వహణలో లోపాలు వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది. ఈ ఉద్యమాలు రెండు నుంచి మూడు నెలల పాటు కొనసాగనున్నట్లు కాంగ్రెస్ నాయకత్వం వెల్లడించింది.

పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓటర్ల తీర్పును ప్రభావితం చేసే విధంగా రాజకీయాలు సాగుతున్నాయని, 'ఓటు చోరీ'తో పాటు 'సీటు చోరీ' కూడా ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారుతోందని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఇక మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో తన నామినేషన్ తిరస్కరణను సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత మీనాక్షీ నటరాజన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో పిటిషన్‌ను ఎలా విచారించాలనే అంశంపై సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నలు లేవనెత్తింది.నటరాజన్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, అభ్యర్థి వెల్లడించాల్సిన నేర కేసుల విషయంలో నిబంధనలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. కేవలం సమన్లు జారీ కావడం, శిక్షకు దారితీసే క్రిమినల్ కేసు నమోదు కావడం రెండూ వేర్వేరు అంశాలని ఆయన వివరించారు.మరోవైపు, ఈ పిటిషన్ ప్రతులు తమకు ఇంకా అందలేదని ఎన్నికల సంఘం తరఫున హాజరైన న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అన్ని వాదనలు విన్న సుప్రీంకోర్టు ఈ అంశంపై శుక్రవారం మరింత విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించింది.రాజకీయంగా టీఎంసీ విలీనం ప్రచారానికి కాంగ్రెస్ చెక్ పెట్టిన నేపథ్యంలో, ప్రతిపక్ష ఐక్యత, మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల వివాదం, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ చేపట్టనున్న ఉద్యమాలు జాతీయ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో ప్రధాన చర్చగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఎవరి సద్ది వాళ్లదే...

- రేపు ఒకేసారి 2 వేల స్కూళ్లలో "టిఫిన్ బైఠక్" లు
- ఒక్కో స్కూలుకు సగటున 25 మంది టిఫిన్ బైఠక్ కు హాజరయ్యే అవకాశం
- చిగురుమామిడి మండలం రేకొండలో టిఫిన్ బైఠక్ కు హాజరుకానున్న కేంద్ర మంత్రి బండి సంజయ్
- 13న(రేపు) అన్ని స్కూళ్లలో "స్వచ్ఛ పాఠశాల" పేరుతో క్లీనింగ్
- సొంతంగా చీపురు, క్లాత్, బకెట్ వెంట తెచ్చుకుని స్కూళ్ల క్లీనింగ్ చేయనున్న ప్రజలు
- ఊరూవాడా కదలిరావాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు
- జమ్మికుంటలో డాక్టర్స్, ప్రముఖులతో కేంద్ర మంత్రి భేటీ
- 12 ఏళ్ల మోదీ పాలనా విజయాల బుక్ లెట్లు అందజేత

**కరీంనగర్ వెలుతురు జూన్ 11:**

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 13న ''స్వచ్ఛ పాఠశాల'' పేరుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేయాలంటూ వినూత్న రీతిలో కార్యక్రమాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే . బండి సంజయ్ పిలుపు మేరకు రేపు ఉదయం 9 గంటలకు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని స్కూళ్లలో ''టిఫిన్ బైఠక్'' పేరుతో ఆయా గ్రామాల ప్రజలు, వివిధ పార్టీల కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు రాజకీయాలకు అతీతంగా సమావేశం కానున్నారు. ఎవరి సద్ది వాళ్లే తెచ్చుకుని అందరూ స్కూల్ ఆవరణలో ఒకే చోట చేరి ''స్వచ్ఛ పాఠశాల'' కార్యక్రమాన్ని ఏ విధంగా నిర్వహించాలి? ఎవరు ఏ తరగతి గదిని శుభ్రం చేయాలి? అనే అంశంపై చర్చించనున్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గా లున్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలన్నీ కలిపి దాదాపు 2 వేల పాఠశాలలున్నాయి. రేపు ఉదయం ఒకేసారి 2 వేల పాఠశాలల్లో 'టిఫిన్ బైఠక్'' పేరుతో సమావేశం కాబోతున్నారు. ఒక్కో స్కూలుకు సగటున 25 మంది హాజరవుతున్నారు. వీరంతా ఆ ఊరులో ఉన్న స్కూల్ లో ఎన్ని తరగతులున్నాయి? వాటిని క్లీన్ చేయడానికి ఒక్కో క్లాస్ రూంకు ఎంత మంది అవసరం అవుతుందని అంచనా వేస్తారు. ఒక్కో క్లాస్ రూంకు ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున బాధ్యత తీసుకుంటారు. ఈనెల 13న సొంతంగా చీపురు, క్లాత్, బకెట్, మగ్ తీసుకొచ్చి తరగతులను శుభ్రం చేస్తారు. ఈ ''స్వచ్ఛ పాఠశాల'' కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలే కాకుండా ఆ గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థలు, ప్రజా, విద్యార్థి, కుల సంఘాల నాయకులతోపాటు



ప్రజలను భాగస్వాములను చేయనున్నారు. పాఠశాలలను సుందరంగా ముస్తాబు చేసి ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్ స్ట్రాగ్రాం వంటి సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తారు.మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సైతం 'స్వచ్ఛ పాఠశాల'' కార్యక్రమంలో పాల్గొని స్కూల్ ను శుభ్రం చేయనున్నారు. అందులో భాగంగా రేపు ఉదయం హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలం రేగొండ పాఠశాలకు వెళతారు. అక్కడ జరిగే టిఫిన్ బైఠక్ సమావేశానికి హాజరవుతారు. తాను సైతం సొంతంగా ఇంటి నుండి అల్పాహారాన్ని తెచ్చుకుని అక్కడున్న వారితో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. రేగొండ పాఠశాలలో ఎన్ని తరగతి గదులున్నాయి? ఒక్కో గది క్లీనింగ్ కు ఎంత మంది అవసరమవుతారు? అనే విషయంపై చర్చిస్తారు. ఒక్కో గదికి ఇద్దరు లేదా ముగ్గురికి బాధ్యత అప్పగిస్తారు. ఈనెల 13న తాను సైతం సొంతంగా చీపురు, క్లాత్, బకెట్ తీసుకుని తన పార్లమెంట్ ఒక తరగతిని ఎంచుకుని ఆ గదిని స్వయంగా శుభ్రం చేస్తారు. ''స్వచ్ఛ పాఠశాల'' నేపథ్యంలో బండి సంజయ్ మాట్లాడుతూ... ''బడి మనది. ఆ బడిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. ఊరూవాడా కదలి వచ్చి ''స్వచ్ఛ పాఠశాల'' కార్యక్రమంలో భాగస్వాములు కండి. స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు సహా ప్రతి ఒక్కరూ కదలిరండి. ముఖ్యంగా రాజకీయాలతో సంబంధం లేకుండా బీజేపీ సహా అన్ని పార్టీల నాయకులు తమ తమ జెండా, ఎజెండా, పార్టీ కండువాలను పక్కన పెట్టి స్వచ్ఛందంగా తమ తమ గ్రామాల్లోని పాఠశాలల్లో రేపు ఉదయం నిర్వహించే టిఫిన్ బైఠక్ కార్యక్రమానికి తరలిరండి. ఈనెల 13న ''స్వచ్ఛ పాఠశాల'' పేరుతో ఆయా పాఠశాలలను పరిశుభ్రం చేసి సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో పాల్గొనండి''అని కోరారు.

### జమ్మికుంటలో ప్రముఖులు, డాక్టర్స్ తో కేంద్ర మంత్రి భేటీ

జమ్మికుంట పర్యటనలో భాగంగా ఈరోజు మధ్యాహ్నం శిశు మందిర్ పాఠశాలలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ డాక్టర్లతోపాటు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సమావేశ మయ్యారు. మోదీ పాలనలో వైద్య రంగంలో జరిగిన అభివృద్ధి, ప్రజల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. మోదీ పాలనలో ఆరోగ్య రంగంలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఆయా డాక్టర్లను కోరారు. ఈసమావేశంలో ఐఎంఏ హుజూరాబాద్ జమ్మికుంట ప్రెసిడెంట్ డాక్టర్ కె.తిరుపతి, ఎథిక్స్ ఛైర్మన్ సీహెచ్.శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ బి.రమేశ్, పి.శ్రీకాంత్, కె.దేవేందర్ రెడ్డి, మురళి, ప్రవీణ్, సంపత్, సాయి, కిశోర్, ఆకుల శ్రీనివాస్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం జమ్మికుంటలోని పాకాల రవీందర్ రెడ్డి నివాసంలో పలువురు ప్రముఖులను కలిశారు. నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

మోదీ పాలన విజయాలను, చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలపై ముద్రించిన పుస్తకాలను వారికి స్వయంగా అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, స్థానిక బీజేపీ నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలి: మంత్రి జూపల్లి కృష్ణారావు

- డ్రగ్స్ కట్టడికి ఏఐని ఆయుధంగా ఉపయోగించాలి
- గంజాయి, సింథటిక్ డ్రగ్స్, ఆన్‌లైన్ నార్కోటిక్ నెట్‌వర్క్‌లు కొత్త సవాళ్లు
- డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై ఏఐ, డేటా అనలిటిక్స్, డ్రోన్లను వినియోగించాలి
- తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి నిఘా వ్యవస్థలను తీసుకువస్తాం
- డ్రగ్స్, గంజాయి ముఠాలపై నిర్దాక్షిణ్యంగా వ్యవహరించండి
- అక్రమార్కులు ఎంతటివారైనా చట్టం ముందు మోకరిల్లేలా పనిచేయాలి
- ఎక్సైజ్ శాఖ ఆదాయ శాఖ మాత్రమే కాదు.. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే శాఖ
- యూనిఫాం ఒక హోదా కాదు.. కోట్లాది ప్రజల నమ్మకానికి ప్రతీక
- శిక్షణ పూర్తి చేసుకున్న ఎక్సైజ్ శాఖ యువ అధికారులకు మంత్రి జూపల్లి దిశానిర్దేశం
- దిక్షాంత్ పరేడ్ కు హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, వెలుతురు జూన్ 11:**

తెలంగాణలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బండ్లగూడ జాగీర్‌లోని ఎక్సైజ్ అకాడమీలో గురువారం నిర్వహించిన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ల దీక్షాంత్ పరేడ్ (పాసింగ్ అవుట్ పరేడ్)లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి, కొత్తగా విధుల్లోకి అడుగుపెడుతున్న అధికారులు ప్రజాసేవ,



కర్తవ్యనిష్ఠ, నిజాయితీని తమ సేవా జీవితానికి మార్గదర్శక సూత్రాలుగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు మంత్రి పురస్కారాలు అందజేశారు.ఆరు నెలల కఠోర సంస్థాగత శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 28 మంది అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, 89 మంది ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కలిపి మొత్తం 117 మంది అధికారులు దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొన్నారు. వీరిలో 33 మంది మహిళా అధికారులు ఉన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మద్యనిషేధ, ఎక్సైజ్ శాఖ కేవలం ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖ మాత్రమే కాదని, యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడటం, సమాజాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి రక్షించే అత్యంత కీలకమైన విభాగమని మంత్రి స్పష్టం చేశారు. ఒకప్పుడు నాటుసారా, గుడుంబా, దేశీదారు, కల్తీ కల్లు ప్రధాన సవాళ్లుగా ఉండేవని, ప్రస్తుతం గంజాయి, సింథటిక్ డ్రగ్స్, నార్కోటిక్ నెట్‌వర్క్‌లు, ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న అక్రమ వ్యాపారాలు కొత్త సవాళ్లుగా మారాయని తెలిపారు. డ్రగ్స్ అనేవి కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదని, కుటుంబాలను విచ్ఛిన్నం చేసి యువత భవిష్యత్తును నాశనం చేసే సామాజిక విపత్తని పేర్కొన్నారు. అధికారులు స్వాధీనం చేసుకునే ప్రతి డ్రగ్స్ ప్యాకెట్ వెనుక ఒక యువకుడి భవిష్యత్తు ఉంటుందని, వారి విధులు కేసుల నమోదు వద్ద ముగియవని, సమాజాన్ని రక్షించడంలో ప్రారంభమవుతాయని అన్నారు.

### సాంకేతికతే అతిపెద్ద ఆయుధం

నేటి కాలంలో నేరగాళ్లు సాంకేతికతను వినియోగించి కొత్త మార్గాల్లో నేరాలకు పాల్పడుతున్నారని, వారిని ఎదుర్కోవడానికి అధికారులు కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మంత్రి సూచించారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు డ్రగ్స్ నెట్‌వర్క్‌లను ఛేదించేందుకు డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక నిఘా వ్యవస్థలను వినియోగిస్తున్నాయని తెలిపారు.డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా గంజాయి సాగు, అక్రమ సారా కేంద్రాలను గుర్తించడం, మొబైల్ యాప్స్, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా రవాణాను పర్యవేక్షించడం, సోషల్ మీడియా ఇంటెలిజెన్స్ ద్వారా డ్రగ్ నెట్‌వర్క్‌లను ముందుగానే పసిగట్టడం సాధ్యమవుతుందని చెప్పారు. తెలంగాణలో కూడా అంతర్జాతీయ స్థాయి నిఘా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

### డ్రగ్స్‌పై నిర్దాక్షిణ్య పోరు అవసరం

డ్రగ్స్, గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని, రాష్ట్రంలోకి మాదకద్రవ్యాలు ప్రవేశించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా చేసే ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమార్కులు ఎంతటివారైనా చట్టం ముందు మోకరిల్లేలా కర్తవ్య నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు.

### సౌమ్య సాహసం స్ఫూర్తిగా తీసుకోవాలి

క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, ప్రజాసేవా దృక్పథమే అధికారుల అసలు గుర్తింపుగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. అక్రమ మద్యం తయారీ, మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టడం ద్వారా తెలంగాణను మరింత సురక్షితమైన, ఆరోగ్యకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. నిజామాబాద్‌లో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ సౌమ్య ధైర్యసాహసాలు కొత్త అధికారులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఖురేషీ, అకాడమీ డైరెక్టర్ సురేష్, జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, జాయింట్ డైరెక్టర్ శశిధర్‌రెడ్డి, చీఫ్ డ్రిల్ ఇన్‌స్పెక్టర్ రంగారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఏఎమ్ఆర్పి హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

- జూలై చివరి నాటికి పనులు పూర్తి చేసేలా ఆదేశాలు జారీ
- రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం

**నల్లగొండ వెలుతురు జూన్ 11:**



సుమారు 442 కోట్ల రూపాయలతో చేపట్టిన ఏఎమ్మార్పీ హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనులను జూలైలోపు సాధ్యమైనంత వరకు పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు.గురువారం మంత్రి నల్గొండ మండల , నర్సింగ్ బట్ల, కుదవన్ పూర్, గుండ్లపల్లి వద్ద ఏ ఎంఆర్పి హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనులను పరిశీలించారు.పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి పనులను ఇంకా వేగవంతం చేయాలని, జూలై 31లోగా ఎంత ఎక్కువ వీలైతే అంత ఎక్కువ పనులు పూర్తి చేసి ఎక్కువ నీరు సులభంగా కిందికి వెళ్లేలా చూడాలని అన్నారు. లైనింగ్ కోసం తాను ప్రత్యేకించి రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి 442 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందని ,దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులకు మేలు కలిగే విధంగా ఈ వానకాలం పంటకు ఎక్కువ నీరు కిందికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.కాగా ఏఎంఆర్పి కాల్వల లైనింగ్ అంగడిపేట నుండి మొదలుకొని మూసీ వరకు సుమారు 136 కిలోమీటర్ల వరకు చేపట్టడం జరుగుతున్నది. 1985– 86 లో జరిగిన ఎంఆర్పి కాలువ తవ్వకం పూర్తికాగా, 40 సంవత్సరాల తర్వాత రాష్ట్ర రోడ్లు, భవనాలు , సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో లైనింగ్ పనులకు నిధులు మంజూరు అయ్యాయి. కాలువ లైనింగ్ పనులు పూర్తయితే రెండు లక్షల ఇరవై వేల ఎకరాలకు సాగునీటిని సులభంగా అందించవచ్చు. ప్రస్తుతం లైనింగ్ లేనందువల్ల ఆయకట్టు చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. లైనింగ్ పూర్తి అయితే కాలువలో సులభంగా నీరు ప్రవహించి త్వరగా చివరి వరకు చేరుతుంది అంతేకాక ఎక్కువ ఆయకట్టుకు నీరు అందించే అవకాశం ఉంది.మంత్రి వెంట ఇరిగేషన్ సి ఈ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ ఈ భద్రు ,ఈ ఈ నెహ్రూ నాయక్,ఇతర ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు ఉన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రని గౌడులకు చేరవేయాలి

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**



సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను గౌడులకు చేరవేయాలని సర్దార్ సర్వాయి పాపన్నజయంతి కమిటీ జాతీయ అధ్యక్షులు బొంగు రఘుగౌడ్ మరియు వెలుతురు ఎడిటర్ బక్క యాదయ్య గౌడ్ గౌడ సంఘం జిల్లా నాయకులు ఈదులకంటి కైలాసం గౌడలు అన్నారు గురువారం ఒక శుభకార్యంలో కలుసుకున్న వారు గౌడుల ఐక్యతను మరింత చాటి చెప్పాలన్నారు సర్దార్ సర్వాయి పాపన్న చరిత్ర తో పాటు గౌడ జాతి చరిత్రను కూడా గౌడులకు వివరించాలన్నారు గ్రామాలలో ఎలాంటి అనుమతులు లేకుండా తాటి ఈత వనాలను నరికి వేస్తున్న వారిపై ఎక్సైజ్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు తాటి ఈత వనాలను నాటడానికి ప్రతి గ్రామంలో గౌడ సొసైటీలు మరియు గౌడ సంఘాలకు 5 ఎకరాల చొప్పున ప్రభుత్వ భూమిని కేటాయించాలన్నారు 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికునికి ఎలాంటి నిబంధనలు లేకుండా పెన్షన్ మంజూరు చేయాలన్నారు.

# ఖమ్మం బాలికపై దారుణం అమానుషం

- బాధిత చిన్నారికి అత్యుత్తమ వైద్యం అందిస్తాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 12 ఏళ్ల బాలికపై దాడి ఘటనపై మంత్రి ఆవేదన
- నిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నారిని పరామర్శించిన తుమ్మల
- నిందితుడు మృగంలా ప్రవర్తించాడని తీవ్ర ఆగ్రహం
- భవనం పైనుంచి తోసేయడంతో వెన్నెముకకు తీవ్ర గాయాలు
- శరీరంలోని పలు ఎముకలకు పగుళ్లు
- వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా
- ప్రభుత్వ ఖర్చుతో మెరుగైన చికిత్స అందిస్తామని హామీ
- చిన్నారి కోలుకోవడానికి మూడు నెలల సమయం పట్టే అవకాశం
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్న మంత్రి
- నిందితుడిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం

**ఖమ్మం వెలుతురు జూన్ 11:**

ఖమ్మం జిల్లాలో 12 ఏళ్ల బాలికపై జరిగిన దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తండ్రి వయసున్న వ్యక్తి చిన్నారిపై అమానుషంగా ప్రవర్తించడం అత్యంత హేయమైన చర్య అని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. నిందితుడి క్రూరత్వం కారణంగా తీవ్ర గాయాలపాలై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను మంత్రి పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడిన మంత్రి, చిన్నారికి అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత బాలిక పరిస్థితిపై వైద్యులు అందించిన నివేదికను పరిశీలించారు. ఘటనలో భాగంగా నిందితుడు చిన్నారిని



భవనం పైనుంచి తోసేయడంతో ఆమె వెన్నెముక తీవ్రంగా దెబ్బతిన్నట్లు వైద్యులు వెల్లడించారని మంత్రి తెలిపారు. అంతేకాకుండా శరీరంలోని పలు భాగాల్లో ఎముకలకు పగుళ్లు వచ్చినట్లు చెప్పారు.ఇలాంటి అమానుష ఘటనలు సమాజం తలదించుకునేలా చేస్తున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బాలికపై జరిగిన దాడి మానవత్వానికే మచ్చ తెచ్చే ఘటనగా అభివర్ణించారు. చిన్నారులపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు అవసరమని పేర్కొన్నారు.బాధిత బాలికకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. చికిత్స కోసం ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందని స్పష్టం చేశారు. అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఆమెకు ఉత్తమ చికిత్స అందించాలని వైద్యులకు సూచించినట్లు తెలిపారు.ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి వైద్యుల పర్యవేక్షణలో ఉందని, కోలుకునే ప్రక్రియకు సమయం పడుతుందని వెల్లడించారు. చిన్నారి పూర్తిగా కోలుకోవడానికి కనీసం మూడు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉందని వైద్యులు అభిప్రాయపడినట్లు చెప్పారు. ఈ కాలంలో అవసరమైన అన్ని వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు.బాధిత కుటుంబ సభ్యులతో కూడా మంత్రి మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాలిక ఆరోగ్యం మెరుగుపడే వరకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి వెల్లడించారు. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు.సమాజంలో ఇటువంటి నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన శిక్షలు అమలు కావాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. చిన్నారుల రక్షణకు కుటుంబాలు, సమాజం, ప్రభుత్వ యంత్రాంగం సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.బాలిక త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించిన మంత్రి, వైద్యులు అత్యుత్తమ చికిత్స అందిస్తున్నారని తెలిపారు. బాధిత చిన్నారికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పునరుద్ఘాటించారు.

# నేను వేశ్యనైతే..?

- "ఒక వేశ్య శరీరాన్ని అమ్మవచ్చు కానీ మనసును కాదు - ఆమె ఎవరో కాదుఆమె కూడా మనమే"
- శరీరాన్ని తాకట్టు పెట్టి కన్నబిడ్డల కడుపులు నింపుకునే మహిళా మణులెందరో ఈ దేశంలో.
- వేశ్య వృత్తి అమ్మానాన్నల జోలె నుంచి కాదు ఆకలితో బతికే సత్యం నుంచి పుట్టింది.
- నిందించాల్సింది ఆమెను కాదు ఆమెను అక్కడ ఆ నిలబెట్టిన పరిస్థితులను.

ఈ నాగరిక వ్యవస్థలో వేశ్య వృత్తి కొన్ని దేశాల్లో కొన్ని సమాజాల్లో సర్వసాధారణమైతే మరి కొన్ని దేశాల్లో ప్రాంతాల్లో ఇది అపవిత్రమైనది తక్కువగా పరిగణించబడుతుంది.

వేశ్య అంటే డబ్బు లేదా ఇతర లాభాల కోసం శారీరక సంబంధాలు కలిగించే మహిళగా సామాజికంగా నిర్వచించబడుతోంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఒక పురాతన వృత్తి. కొన్ని సమాజాల్లో ఇది గౌరవపూర్వకంగా చూసే వృత్తి కాగా, మరికొన్ని సమాజాల్లో తక్కువగా పరిగణించబడుతోంది. వేశ్య వ్యవస్థకి సంబంధించిన చరిత్ర, కారణాలు, పరిస్థితులు, సామాజిక దృష్టికోణం, సమస్యలు మరియు పరిష్కారాలను వివరంగా తెలుసుకోవడం అవసరం.వేశ్యావృత్తి అనేది మనుషుల నాగరికతకు తోడు వచ్చిన వృత్తిగా చరిత్రకారులు భావిస్తారు. మానవుల మధ్య లైంగిక ఆకాంక్షల వల్ల, కొన్ని సమాజాల్లో వేశ్యలు పూజారుల్లా గౌరవించబడే స్థితిలో ఉండేవారు. ప్రభుత్వం వారికి మానవ హక్కులు, జీవనోపాధి హక్కు, ఆరోగ్య హక్కు, విద్య హక్కు ఉండేలా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి.పోలీసుల వేధింపులకు, లైంగిక హింసకు గురికాకుండా ప్రత్యేక న్యాయ పరిరక్షణ (legal aid) అందించాలి.వేశ్యల పిల్లల కోసం విద్యా బృందాలు, హాస్టళ్లు, స్కాలర్షిప్‌లు ఏర్పాటు చేయాలి.మానవ అక్రమ రవాణాను (Human Trafficking) పూర్తిగా అణచివేయడంలో అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా కొత్త చట్టాలు రూపొందించాలి.మద్యం ప్రదేశాల నిర్వహణ, బాలల వేశ్యావృత్తి లాంటి వాటికి శిక్షలు కఠినతరం చేయాలి.ట్రాఫికర్లు, మధ్యవర్తులకు కఠిన శిక్షలు అమలు చేయాలి.

వేశ్య అవ్వడానికి ప్రధాన కారణాలు:

1. పేదరికం:

జీవనోపాధి లేక, కుటుంబాలను పోషించాలన్న బాధ్యతతో కొన్ని మహిళలు వేశ్యావృత్తిని ఎంచుకుంటారు.

2. అనాధత్వం:

చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు మానవ అక్రమ రవాణాకు గురై ఈ వృత్తిలోకి బలవంతంగా లాగబడతారు.

3. ఆశ్రమం మరియు ఉద్యోగావకాశాల లోపం:

విద్యాభావం వల్ల ఏ వృత్తినైనా పొందలేక, చివరికి ఈ మార్గం వైపు మొగ్గుతారు.

4. బలవంతపు వ్యభిచారం:


చాలా సార్లు మహిళలు అక్రమ మానవ రవాణా మాఫియాల వలలో పడతారు.

5. సామాజిక వివక్ష:

నిరాదరణ పొందిన, వలసబద్ద వర్గాల నుండి వచ్చిన మహిళలు వేశ్యావృత్తిలోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

**నేను వేశ్య నైతే.. ఒకవేశ్య అంతరాంగిక అంతర్మధన ఆవేదన..**

నీ కామం అనే ఆకలికి నేను ఆహారం, నీ లైంగిక వాంఛను తీర్చే ఓ ముడి సరుకును, నీ శారీరక కోరికకు నన్ను నేను సమర్పించుకునే ఓ త్యాగిని.ఈ సమాజంలో నేను ఎదుర్కొన్న పరిస్థితులే, సమస్యలే నన్ను ఈ నాలుగు గోడల మధ్యన సింగారించిన నల్లరాతి లాగా వ్యభిచారిని అనే ఒక దోషి లాగా నీ కామ కోరికల ముందు ఒక కీలుబొమ్మలాగా నన్ను నిలబెట్టింది. నేను ఎవరిని నిందించాలి..? నా అంతరాత్మనా నన్ను ఈ కూపంలోకి నెట్టిన ఈ పరిస్థితులనా లేక నన్ను పోషిస్తున్న ఈ పురుషాదిక్య సమాజాన్నా..? ఎవరిని నిందించినా కూడా దోషినైతే నేనే కదా..! నా బిడ్డల ఎండిన డొక్కలు నన్ను ప్రశ్నిస్తున్నాయి నా కొంపలో ఖాళీ కుండలు నన్ను వెక్కిరిస్తున్నాయి అగ్నిసాక్షిగా నా మెడలో మంగళసూత్రం కట్టి తనలో కలుపుకున్న నా అర్ధభాగం (భర్త) గమ్యం తెలవని నన్ను రెండు కాళ్ల జంతువులు ఉండే ఈ నాగరిక అడవిలో వదిలి నా చేత శత్రువు తెలియని యుద్ధం చేయిస్తున్నాడు నా జనన మర్మాంగాలతో వ్యాపారం చేయిస్తున్నాడు వెలకట్టలేని గర్భాలయాన్ని తూకం వేస్తున్నాడు.నా శరీరం నాకు ఎముకల గూడు కానీ అతనికి మాత్రం పట్టు పాన్పు. నేను క్షతఘాతురాల్ని శారీరక రోగినే కాదు మానసిక రోగిని కూడా నా స్వేద రంధ్రాల గుండా శ్రవించే స్వేదం, నా నేత్రాల నుండి ఉద్భవించే నా కన్నీరు, శరీరం నుంచి ఉట్టి పడే నెత్తుటి మరకలు వీటన్నింటి కలయికగా నన్ను నన్నుగా చూసేది నన్ను మోస్తున్న నేను నిలబడుతున్న ఈ భూమి మాత్రమే అనుకుంటా. ఈ నిశ్శబ్ద సమాజంలో నేనో నిషాధిని.. శాంతి ప్రేమికులు, శాంత కాముకులు ఈ నిషాధికి నిలువ నీడనిద్దురా..? ఈ నిగూఢ సమాజాన్ని నిశ్శబ్దం అనే చీకటి అలుముకున్నది. సమాజం ఈ నిశ్శబ్దాన్ని వీడేదెన్నడో..! నా శరీరం మలినమైతదేమో కానీ నా మనసు ఎప్పటికీ పవిత్రమే..! నేను ఎవరినో కాదు నేను నువ్వే, నన్ను నిందిస్తే నిన్ను నువ్వు నిందించుకున్నట్టే. స్థిరత్వం లేని జీవితం నాది నిలకడ లేని బ్రతుకు నాది. నేను గబ్బిలం లాంటి దాన్ని పగలంతా విశ్రాంతిలో ఉంటాను రాత్రిపూట పొట్టకూటి కోసం తిప్పలు పడతాను నా ఎదలో సేద తీరేందుకు అల్లాడిపోయే కాముకులు ఎందరో వారికి నా ఈ మాంసపు ముద్దతో పని తప్ప నా మనసుతో ఏం పని..? నా జీవితానికి ముగింపు పలుకుదాం అంటే పలక లేని పరిస్థితులు పలకనివ్వని బాధ్యతలు నేను పరుగుపందెంలో పరుగెత్తే అశ్వమేధాన్ని నేను పరిగెత్త గలిగినంత వరకే ఈ పందెంలో పోటీ దారును నా మాంసపు ముద్ద కుషించుకుపోయిన నాడు నన్నేం చేస్తారో నేనేమైపోతానో నాకే తెలియదు. గాలిలోని దీపం లాంటిదాన్ని ఆ గాలి నాకు ఊపిరి ఆ గాలే నా పాలిట యమపాశం కూడ.మాకు ఆశయాలు ఆకాంక్షలు వంటివి ఏం ఉండవు కోరికలు వాంఛలు కూడా ఉండవు మాకు ఆస్తిపాస్తులు కూడా ఏమీ ఉండవు నా శరీరమే నా ఆస్తి, రక్త మాంసాలే పెట్టుబడి. మాకు ఉన్నదల్లా మేము కోరుకునేదల్ల ఒకటే మమ్మల్ని ఒక వింత ప్రాణిలా కాకుండా సాటి మనిషిగా చూస్తే చాలు. మా ఈ పోరాటానికి పిడికడు మెతుకులే సాక్ష్యం.



**ఈద శేఖర్**
**70369 97589**

# అల్లాపూర్ భూపోరాటం... న్యాయం కోసం రెండు దశాబ్దాల నిరీక్షణ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు నుంచే సాగిన అనేక ప్రజా ఉద్యమాలలో అల్లాపూర్ భూపోరాటం ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఇది కేవలం భూమి యాజమాన్యానికి సంబంధించిన వివాదం మాత్రమే కాదు, న్యాయం కోసం, హక్కుల కోసం, అధికార వ్యవస్థల నిర్లక్ష్యం మరియు అన్యాయాలకు వ్యతిరేకంగా సాగిన సుదీర్ఘ పోరాటం. దాదాపు రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ భూపోరాటం, ఇటీవల ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసు కొట్టివేతతో మరోసారి ప్రజల దృష్టిని ఆకర్షించింది.2013లో నమోదైన ఈ కేసు, తెలంగాణ ఉద్యమ సమయంలో అల్లాపూర్ భూముల రక్షణ కోసం పోరాడుతున్న నాయకులు, భూమి యజమానులు మరియు వారి ప్రతినిధులపై మోపబడింది. ఈ కేసులో ప్రముఖ ప్రజా కళాకారిణి, తెలంగాణ ఉద్యమకారిణి విమలక్కతో పాటు ఖాద్రి కుటుంబ సభ్యులు, జీపీఏ హోల్డర్లు కూడా నిందితులుగా చేర్చబడ్డారు. అయితే సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ కోర్టు ఈ కేసును కొట్టివేయడం ద్వారా ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చినట్లుగా బాధితులు భావిస్తున్నారు.వారి అభిప్రాయం ప్రకారం, భూకబ్జాలకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాన్ని అణచివేయడానికి ఈ కేసు ఉపయోగించబడింది. భూమి వివాదం కొనసాగుతున్న సమయంలోనే ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయడం వెనుక రాజకీయ, ఆర్థిక మరియు పరిపాలనా ప్రయోజనాలు ఉన్నాయని వారు వాదిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని ఈ కేసు పెట్టబడిందనే అభిప్రాయం ఉద్యమకారులలో బలంగా వ్యక్తమవుతోంది.విమలక్క వంటి వ్యక్తిత్వంపై ఇలాంటి కేసు నమోదు కావడం ఆ సమయంలో తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా కలచివేసింది. దళిత, బహుజన, గిరిజన మరియు అణగారిన వర్గాల కోసం జీవితాంతం పోరాడిన వ్యక్తిపై అదే వర్గాల పేరుతో చట్టపరమైన కేసు పెట్టడం ఒక విరుద్ధ పరిస్థితిగా చాలామంది భావించారు. దీనిని ఉద్యమకారులు కేవలం న్యాయపరమైన అంశంగా కాకుండా, వ్యక్తిత్వ హననానికి చేసిన ప్రయత్నంగా కూడా అభివర్ణించారు.ఈ కేసు నమోదు అనంతరం హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రజాస్వామ్య వాదులు, మేధావులు, తెలంగాణ ఉద్యమ నాయకులు, సామాజిక కార్యకర్తలు ఈ కేసును వ్యతిరేకిస్తూ స్పందించారు. న్యాయస్థానంలో జరిగిన విచారణ అనంతరం కేసు నిలదొక్కుకునేంత ఆధారాలు లేవని తేలడంతో బాధితులు తమ వాదనలకు న్యాయపరమైన బలం లభించిందని భావిస్తున్నారు.అయితే ఈ కేసు వెనుక ఉన్న అసలు కథ అల్లాపూర్ భూముల చరిత్రతో ముడిపడి ఉంది. అల్లాపూర్‌లోని సర్వే నంబర్లు 1 నుండి 55 వరకు ఉన్న భూములు దశాబ్దాలుగా వివాదానికి కేంద్రబిందువుగా ఉన్నాయి. నిజాం కాలంలో పండిత విద్వాంసుడు సయ్యద్ షా ఆలం ఖాద్రికి దర్ ఖరీది ఇనాంగా మంజూరైన ఈ భూములపై తరువాత అనేక వివాదాలు తలెత్తాయి. భూస్వామ్య హక్కులు, ఇనాం చట్టాల అమలు, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ యంత్రాంగం పాత్ర వంటి అనేక అంశాలు ఈ వివాదంలో భాగమయ్యాయి.భూముల యాజమాన్యానికి సంబంధించిన పత్రాలు, వసూలు బాకీలు, షేత్వార్ రికార్డులు ఇనాందారుల పేర్లపై కొనసాగుతున్నప్పటికీ, కాలక్రమేణా భూములపై ఇతరుల పేర్లు నమోదయ్యాయని బాధితులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అల్లాపూర్ వంటి విలువైన ప్రాంతంలో ఉన్న భూములపై అక్రమ ఆక్రమణలు జరిగాయని, వాటికి అధికార వ్యవస్థలోని కొంతమంది సహకరించారని వారు చెబుతున్నారు. బాలానగర్ ఎమ్మార్వో కార్యాలయంలో ఫైళ్లు తగలబడిన ఘటన కూడా అనుమానాలకు తావిచ్చింది. ఆ ఘటన తరువాత సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్నప్పటికీ, భూములపై కొనసాగుతున్న వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించలేదని బాధితులు పేర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా పరిస్థితిలో గణనీయమైన మార్పు రాకపోవడం వారిని మరింత నిరాశకు గురి చేసింది.2006లో బాధితులు ల్యాండ్ సర్వే అండ్ సెటిల్మెంట్ కమిషనర్‌ను ఆశ్రయించి గ్రామ మ్యాపులు, పాత రికార్డులు సమర్పించారు. అక్రమంగా నమోదైన పేర్ల తొలగింపుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత అధికారులు కోర్టులను ఆశ్రయించాలని సూచించినప్పటికీ, రెండు దశాబ్దాలు గడిచినా సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆక్యుపేషనల్ రైట్స్ సర్టిఫికెట్ (ORC) మంజూరు విషయంలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. డినోవో విచారణలు జరిగాయి. జాయింట్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు నివేదికలు సమర్పించారు. భూములు ఇనాం భూములేనని పలువురు అధికారులు పేర్కొన్నారని బాధితులు చెబుతున్నారు. అయినప్పటికీ తుది నిర్ణయం మాత్రం వెలువడలేదని వారు విమర్శిస్తున్నారు.కూకట్‌పల్లి ఎమ్మార్వో నిర్వహించిన సర్వేలో 35 ఎకరాల ఖాళీ భూమి ఉన్నట్లు నిర్ధారణ జరిగినట్లు వారు చెబుతున్నారు. గుట్టల బేగంపేట–కూకట్‌పల్లి మండలాల మధ్య ఉన్న పరిపాలనా వివాదం కూడా పరిష్కారమైందని పేర్కొంటున్నారు. అయినప్పటికీ అసలు భూ యజమానులకు న్యాయం జరగకపోవడం ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని వారు అభిప్రాయపడుతున్నారు.హైకోర్టు ఆరు వారాల్లో వివాదాన్ని పరిష్కరించాలని ఆదేశించినప్పటికీ, పదేళ్లు గడిచినా అమలు జరగకపోవడం మరో ఆందోళనకర అంశం. ఇదే విధంగా, అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై స్థానిక సంస్థలు చర్యలు తీసుకోలేదని, సమాచార హక్కు చట్టం కింద పొందిన వివరాలు కూడా దీనిని సూచిస్తున్నాయని బాధితులు చెబుతున్నారు.ఈ మొత్తం పరిణామాలను పరిశీలిస్తే, అల్లాపూర్ భూపోరాటం కేవలం ఒక భూవివాదం కాదని స్పష్టమవుతుంది. ఇది న్యాయవ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ, పరిపాలనా వ్యవస్థల పనితీరు, ప్రజా హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం వంటి విస్తృత అంశాలను స్పృశిస్తుంది. ఒకవైపు కోట్ల రూపాయల విలువైన భూములపై వివాదాలు కొనసాగుతుండగా, మరోవైపు అసలు హక్కుదారులుగా చెప్పుకుంటున్న కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయని ఉద్యమకారులు వాదిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన అనేక మంది కార్యకర్తలు ఈ ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. ప్రొఫెసర్ కేశవరావు జాదవ్, చుక్కా రామయ్య, కపిలవాయి దిలీప్ కుమార్ వంటి ప్రముఖులు అల్లాపూర్ భూపోరాటానికి సంఘీభావం తెలిపినట్లు ఉద్యమకారులు గుర్తుచేస్తున్నారు. అయితే అప్పటి ప్రభుత్వాలు సభలకు అనుమతులు నిరాకరించడమే కాకుండా, భూకబ్జాల ఆరోపణలపై తగిన చర్యలు తీసుకోలేదని వారు విమర్శిస్తున్నారు.ఇటీవల వెలువడిన కోర్టు తీర్పు బాధితులకు కొంత ఉపశమనం కలిగించినా, అసలు సమస్యకు అది పూర్తి పరిష్కారం కాదని చెప్పాలి. భూములపై యాజమాన్య హక్కుల స్పష్టత, ఓఆర్సీ మంజూరు, అక్రమ ఆక్రమణలపై చర్యలు, బాధ్యులపై విచారణ వంటి అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. అందువల్ల ఈ తీర్పును ఒక ముగింపుగా కాకుండా, న్యాయం వైపు మరో అడుగుగా చూడాల్సిన అవసరం ఉంది.ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయం ఆలస్యమైనా అందాలి. కానీ ఆలస్యమైన న్యాయం వల్ల బాధితులు ఎదుర్కొనే మానసిక, ఆర్థిక, సామాజిక నష్టాలను కూడా గుర్తించాలి. అల్లాపూర్ భూపోరాటం అదే విషయాన్ని మనకు గుర్తు చేస్తోంది. రెండు దశాబ్దాలుగా సాగుతున్న ఈ పోరాటం ఇంకా పూర్తి కాలేదు. కోర్టు తీర్పు ఒక ముఖ్యమైన మలుపు మాత్రమే. అసలు లక్ష్యం భూములపై న్యాయబద్ధమైన హక్కుల నిర్ధారణ, బాధితులకు న్యాయం, అక్రమాలకు ముగింపు.అందుకే అల్లాపూర్ సమస్యను ప్రభుత్వం, న్యాయవ్యవస్థ, రెవెన్యూ శాఖలు అత్యవసర ప్రాధాన్యంతో పరిశీలించాల్సిన అవసరం ఉంది. గతంలో జరిగిన తప్పిదాలు, ఆలస్యాలు, వివాదాలను పక్కనబెట్టి చట్టబద్ధమైన పరిష్కారాన్ని అందించాలి. అదే నిజమైన ప్రజాస్వామ్యానికి, తెలంగాణ ఆత్మకు, న్యాయసూత్రాలకు తగిన గౌరవం అవుతుంది. అల్లాపూర్ భూపోరాటం చివరకు న్యాయవిజయంతో ముగియాలని కోరుకోవడం కేవలం బాధితుల ఆశ మాత్రమే కాదు, ప్రజాస్వామ్య విలువలను విశ్వసించే ప్రతి ఒక్కరి ఆకాంక్ష కూడా.



**మన్నారం నాగరాజు**
**సామాజిక రాజకీయ విశ్లేషకులు**

# ప్రభుత్వ విద్యాసంస్థల మూసివేత సరికాదు : ఏఐవైఎఫ్

**మేడ్చల్ ,వెలుతురు జూన్ 11:**

తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా, ప్రభుత్వం మాత్రం హామీలు, ప్రకటనలతో కాలయాపన చేస్తోందని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయకుండా ప్రభుత్వ విద్యాసంస్థల మూసివేత సరికాదని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారని, ఇప్పటికీ రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఉన్న ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేయడంలో విఫలమైందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అనేక శాఖల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివిధ నివేదికలు సూచిస్తున్నాయన్నారు. ఇటీవల టీజీపీఎస్సీ ద్వారా కొన్ని నియామక నోటిఫికేషన్లు విడుదల కావడం స్వాగతించదగిన విషయమే అయినప్పటికీ, అవి రాష్ట్రంలోని మొత్తం ఖాళీలతో పోలిస్తే చాలా స్వల్పమని వారు దుయ్యాబట్టారు . అటవీ శాఖలో 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు, రోడ్లు–భవనాల శాఖ మరియు కాలుష్య నియంత్రణ మండలిలో 290 ఇంజనీరింగ్ పోస్టులు, విద్యాశాఖలో 24 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్లు వెలువడ్డాయని, ప్రభుత్వం శాఖల వారీగా మొత్తం మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, ఖాళీ పోస్టుల వివరాలను ప్రజలకు వెల్లడించకుండా వాస్తవాలను దాచిపెడుతోందనే అనుమానం కలుగుతోందన్నారు. అందుకే రాష్ట్రంలోని అన్ని శాఖలపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



# పెద్దఅంబర్ పేట్ లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

- గత 15 ఏళ్ల పాలనలో ఆగమైన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం రానున్న రోజుల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నెంబర్ వన్ గా అభివృద్ధి చేస్తాం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 11:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పెద్దఅంబర్ పేట్ లో కల్యాణ లక్షి షాదీ ముబారక్ చెక్కులు 400 మంది లబ్ధిదారులకు అందజేసిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ గత15ఏళ్ల పాలనలో ఆగమైన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం రానున్న రోజుల్లో నెంబర్ వన్ గా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆర్థిక కష్టాల్లో ఉన్నాపేదల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు ప్రగతినిరోధకుల ఆరోపణలు పట్టించుకోవాల్సిన అవసరంలేదన్న ఎమ్మెల్యే రెండున్నరేళ్లలో దాదాపు 3వేల కోట్ల రూపాయలు నియోజకవర్గానికి తెచ్చామనిరానున్న రోజుల్లో కనీవినీ ఎరుగని రీతిలోఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు గత15ఏళ్ల కాలంలో నియోజ కవర్గాన్ని ఆగంచేశారని ఆరోపించారు రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్ పేట్ లో కళ్యాణలక్షి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు తుర్కయంజాల్ జోన్ కు చెందిన153మందికి పెద్దఅంబర్ పేట్ లో 140మందికి అబ్దుల్లాపూర్ మెట్ మండలానికి చెందిన107 మందికి ఈ చెక్కులు మంజూరయ్యాయి మొత్తం 400మంది లబ్ధిదారులకు 4కోట్ల 46వేల 400 రూపాయల విలువ చేసే చెక్కులను ఈసందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి పంపిణీ చేశారు మిగులు నిధులతో ఏర్పడిన తెలంగాణలో పేదలకు పంచాల్సిన సంపదనుఒకేకుటుంబందోచుకోవటంతోనే నేడు ఆర్థిక కష్టాలు తలెత్తాయని ఆయన ఆరోపించారు కష్టాలు ఉన్నప్పటికీ అభివృద్ధి-సంక్షేమం విషయంలో సమతూకం పాటిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి పథం లో నడిస్తోందని చెప్పారు గతంలో మంత్రులకు సైతం సీఎం అందుబాటులో ఉండేవారు కాదన్న మల్ రెడ్డి ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ప్రజాసమస్యలపై ఒక్కఫోన్ కాలందూరంలో ఉంటారని చె ప్పారుఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్న పార్టీకే ఫ్యూచర్ లేదని చెప్పారు రాష్ట్రంలో ఇబ్రహీం పట్నం నియోజకవర్గాన్ని నంబర్ వన్ గా తీర్చిదిద్దుతామని హామీఇచ్చిన ఆయన తాము చేసే అ భివృద్ధిలో ప్రజలు ప్రజాప్రతి నిధులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో ఎం పీడీవో తహసీల్దార్ ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కోహెడ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడి ఆధ్వర్యంలో వినూత్నంగా బడిబాట కార్యక్రమం

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికల పెంపునకు మీలా విజయ్ కుమార్ అవగాహన ప్రచారం

**అబ్దుల్లాపూర్ మెట్ వెలుతురు జూన్ 11:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్ కోహెడ ప్రభుత్వ పాఠశాల అనుబంధ గ్రామ మైన సంఘీ నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచడం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వ ఉపాధ్యా యుడు మీలా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో వినూత్నంగా నిర్వహించారుఈ సందర్భంగా గ్రామం లోని ప్రతి వీధిలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేస్తూ విస్తృత అవగాహన కల్పించారు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నా ణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫాంలు మధ్యాహ్న భోజన పథ కండిజిట ల్ విద్య క్రీడా సౌకర్యాలు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు మరియు విద్యార్థుల సమగ్ర వికాసానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశా లను వివరించారు ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం ఆధునిక వసతులు అర్హత కలిగిన ఉపాధ్యాయులు మరియు మెరుగైన బోధనా విధానాలతో అభివృద్ధి చెందు తున్నాయని తెలిపారు ప్రతిచిన్నారికి నాణ్యమైన విద్యను అందించడం సమాజం మొత్తంబాధ్య త అని పేర్కొంటూ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలని పిలుపునిచ్చారు ప్రభుత్వ పాఠశాలలు కేవలం విద్యను మాత్రమే కాకుండా విద్యార్థులవ్య క్తిత్వ వికాసం నైతిక విలువలు క్రమశిక్షణ మరియు సమగ్ర అభివృద్ధికి బలమైన పునాది వేస్తాయి అని అన్నారుఈ



కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు మహిళలు విద్యార్థుల తల్లిదండ్రులు మరియు స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొని కార్య క్రమానికి మద్దతు తెలిపారు ప్రభు త్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యా వికాసంద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని వారు ఆకాంక్షించారు.

# ఆర్జీకే చిరు వ్యాపారులకు అండగా ఉంటాం: కొలాన్ హన్మంత్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 11:**

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) సముదాయంలో గత 18 సంవత్సరాలుగా జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల షాపులను తొలగించవద్దని కోరుతూ ఆర్జీకే నాయకులు, వ్యాపారులు గురువారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలాన్ హన్మంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వ్యాపారులు మాట్లాడుతూ, ఆర్జీకే సముదాయంలో సుమారు 1,779 కుటుంబాలు,దాదాపు 7 వేల మంది జనాభా నివసిస్తున్నప్పటికీ స్థానికంగా షాపింగ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద లబ్ధిదారుల కుటుంబాలు చిన్నచిన్న (డబ్బాలు) షాపులు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాయని



తెలిపారు.అయితే ఇటీవల జీసీఎంసీ అధికారులు షాపులను తొలగించాలని హెచ్చరించడం వల్ల వందలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా షాపులను తొలగించవద్దని, తమ జీవనాధారాన్ని కాపాడాలని కోరారు. వినతిపత్రం స్వీకరించిన కొలాన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ చిరు వ్యాపారుల షాపులను తొలగించడం సరికాదన్నారు. గతంలో హౌసింగ్ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులతో చర్చించి షాపులను తొలగించకుండా ప్రహరీ గోడ నిర్మించేలా చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. ఆర్జీకేలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు కబ్జాదారులు కాదని, స్థానిక లబ్ధిదారులేనని పేర్కొన్నారు. అసలైన భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని, నిరుపేద చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులకు సూచించారు. ఒకవేళ షాపుల తొలగింపునకు ప్రయత్నిస్తే సహించేది లేదని, చిరు వ్యాపారుల పక్షాన నిలబడి న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ గణేష్, ఆర్జీకే నాయకులు లక్ష్మణ్ రావ్, యువరాజ్, శ్రీనివాస్ రెడ్డి, చిరు వ్యాపారులు వెంకటేష్, నాగభూషణం, మహేష్, శ్రీనివాస్,కోటేశ్వరరావు, జయమ్మ,శ్రీశైలం,చంద్రశేఖర్, పీవీఆర్, సత్యనారాయణ, అప్పారావు,మొయిన్, తదితరులు పాల్గొన్నారు.

# తుర్క చెరువును అభివృద్ధిపరిచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తాం: బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 11:**



గురువారం సిఎంసి నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధి బండారి లేఅవుట్, తుర్క చెరువు ప్రాంతాలలో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ప్రజా సమస్యలపై అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు.ఈ సందర్భంగా స్థానికులు లో ప్రెజర్ తో నీటి సరఫరా, లైబ్రరీ పైకప్పు లీకేజీ, ఒంటరి మహిళలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు, ఎస్ఎన్డిపి పనుల వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.....గతంలో వర్షం వచ్చిన ప్రతిసారి బండారి లేఔట్ లోని ప్రజలు వరద నీటి సమస్యతో భయాందోళనకు గురయ్యేవారని గత 12 ఏళ్ల కాలంలో ఎస్ఎన్డిపి పనుల ద్వారా వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానిదన్నారు. బండారి లేఔట్ లోని లైబ్రరీ పైకప్పు లీకేజీ సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించి పైకప్పు లీకేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయింప చేయడంతో పాటు పెన్షన్లను, దారిద్యరేఖకు దిగువన ఉన్నవారికి రేషన్ కార్డులను ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు.గతంలో ఎస్ ఎన్ డి పి పనుల ద్వారా బండారి లేఔట్ లో వరద ముంపు తీవ్రతను తగ్గించామని, రానున్న రోజుల్లో కూడా ఎస్ ఎన్ డి పి ఫేస్ -2 పనులను త్వరితగతిన పూర్తి చేసి వరద ముంపు సమస్యకు శాశ్వతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం ఇరిగేషన్ అధికారులతో కలసి తుర్క చెరువును సందర్శించిన ఎమ్మెల్యే చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మురుగునీటిని బయటకు పంపించి వాకింగ్ ట్రాక్, పిల్లల కోసం ఆట సామాగ్రి తో పాటు చెరువును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాబేర్ అలీ, ఇరిగేషన్ డీఈ నాయక్, ఈఈ సురేష్ బాబు, వాటర్ వర్క్స్ మేనేజర్ సౌమ్య, ఏఈ రవీంద్ర నాయక్, ఇంజనీరింగ్ ఏఈ ప్రవీణ్, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ జ్యోతి నరసింహారెడ్డి, చందు ముదిరాజ్, ఆగం రాజు, బాలాజీ నాయక్, గాజుల సుజాత, మాజీ కో ఆప్షన్ సభ్యులు చంద్రగిరి జ్యోతి సతీష్, సంక్షేమ సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు నరసింహారాజు, సీనియర్ నాయకులు జొన్నలగడ్డ రవి, పద్మావతి, లక్ష్మి కుమారి, భారతి, శ్రీదేవి, మాన్య తదితరులు పాల్గొన్నారు.

# చిత్తాపూర్ గ్రామం సర్వే నెంబర్ 92 భూమిలో మైనింగ్ ఏర్పాటు చేయవద్దు

- ఏర్పాటు చేస్తే అడ్డు కుంటాం: చిత్తాపూర్ గ్రామం మాజీ సర్పంచ్ బొడ్డు నాగరాజుగౌడ్

**మంచాల వెలుతురు జూన్ 11:**



మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ బిఅర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బొడ్డు నాగరాజు గౌడ్ మాట్లాడుతూచిత్తాపూర్ గ్రామం సర్వేనెంబర్ 92లో దాదాపు విస్తీర్ణం 270 ఎకరాల భూమి ఉన్నది ఇందులో ప్రభుత్వం మైనింగ్ 33ఎకరాలు కేటాయించింది మైనింగ్ ఏర్పా టు చేస్తే చుట్టుప్రక్కల ఉన్న గ్రామాలు దుమ్ము ధూళితో నిండి పోయి ప్రజలు రోగాల బరిన పడ తారు బ్లాస్టింగ్ శబ్దాలకు భూమి అదిరి ప్రక్కనఉన్న వ్యవసాయ భూముల్లో బోర్లు దెబ్బతిని పాడై పోతాయి పశువులు మేకలు గోర్లు తినే గడ్డి చెట్లు కాలుష్యం అయిపోతాయి పచ్చటి పంట పొలా లు క్రాస్లర్ల నుండి వచ్చే రాయి దుమ్ముతో కాలుష్యంతో నిండి పోతాయి అని అన్నారు చుట్టుప్రక్క ల ఉన్న రైతులు వ్యవసాయం చేసుకుంటేనే జీవనాధారం అలాంటి ప్రాంతంలో మైనింగ్ ఏర్పాటు చేస్తే పచ్చటి పొలాలని పంటలు పండవు పశువులకు మేత కరువవుతుంది రైతులు దిక్కులేని ప క్షులవుతారు అని వెంటనే స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారు స్పందించి ప్రభుత్వం దృష్టికితీసుకువెళ్ళాలి ఇలాంటి క్రషర్లతో రైతులని ఇబ్బంది పెట్టవద్దు మైనింగ్ ఏర్పాటును చుట్టుపక్క గ్రామాల ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారు అని అన్నారు మైనింగ్ ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఎవరైనా వచ్చి మైనింగ్ కోసం క్రాసర్లు ఏర్పాటు చేస్తే అడ్డుకుంటాం పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం అని అన్నారు.

# వనస్థలిపురంలో ఘనంగా 'అతిథి పులావ్స్ అండ్ కర్రీస్' రెస్టారెంట్ ప్రారంభోత్సవం

**వనస్థలిపురం వెలుతురు జూన్ 11:**



వనస్థలిపురంలో భోజన ప్రియులకు అసలైన తెలుగు రుచులను అందించే లక్ష్యంతో 'అతిథి పులావ్స్ అండ్ కర్రీస్' రెస్టారెంట్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. వనస్థలిపురం రైతుబజార్ రోడ్, సంపూర్ణ థియేటర్ పక్కన ఏర్పాటు చేసిన ఈ నూతన భోజనశాలను రెస్టారెంట్ యజమాని అంజిబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యజమాని అంజిబాబు మాట్లాడుతూ, నాణ్యమైన మరియు అత్యంత తాజా పదార్థాలతో మన వంటకాల ఘనమైన వారసత్వాన్ని ప్రతిబింబించేలా రుచికరమైన వంటకాలను ఇక్కడ అందిస్తున్నామని తెలిపారు. ఇక్కడికి వచ్చే ప్రతి కస్టమర్‌కు రాజభోజనం లాంటి అద్భుతమైన అనుభూతిని అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. కస్టమర్లకు ప్రతిరోజూ కొత్త రుచులను ఆస్వాదించే అవకాశం కల్పిస్తూ వారంలో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకమైన మెనూను ఇక్కడ అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. వివిధ రకాల వంటకాలను భోజన ప్రియుల కోసం సిద్ధం చేసినట్లు వివరించారు. బగారా, వెజ్, నాన్-వెజ్ కర్రీస్, మీల్స్, రోటీలతో పాటు అచ్చమైన తెలుగు రుచులను ఆస్వాదించాలనుకునే నగరవాసులు తమ 'అతిథి పులావ్స్ అండ్ కర్రీస్'ను తప్పకుండా సందర్శించి, ఆదరించాలని ఈ సందర్భంగా యజమాని అంజిబాబు కోరారు.

# కొత్తపేటలో మద్రాస్ ప్రీమియం కాఫీ నూతన బ్రాంచ్ ప్రారంభం

- ప్రజలకు నాణ్యమైన ఫిల్టర్ కాఫీ అందించడమే లక్ష్యం
- జగన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి

**ఎల్ బీ నగర్, వెలుతురు జూన్ 11:**



కొత్తపేట: కొత్తపేట ప్రాంతంలో మద్రాస్ ప్రీమియం కాఫీ నూతన బ్రాంచ్‌ను జగన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి బ్రాంచ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దక్షిణ భారతీయ సంప్రదాయ ఫిల్టర్ కాఫీ రుచిని ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో మద్రాస్ ప్రీమియం కాఫీ బ్రాంచ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. నాణ్యత, రుచి, పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని పేర్కొన్నారు.యువతతో పాటు కుటుంబ సభ్యులు సైతం ఆహ్లాదకరమైన వాతావరణంలో కాఫీని ఆస్వాదించేలా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దామని తెలిపారు. తక్కువ ధరల్లో ఉత్తమ నాణ్యత కలిగిన కాఫీతో పాటు వివిధ రకాల పానీయాలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.మద్రాస్ ప్రీమియం కాఫీ దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న ఫిల్టర్ కాఫీ బ్రాండ్‌గా గుర్తింపు పొందిందని, వినియోగదారుల ఆదరణతో మరిన్ని ప్రాంతాల్లో సేవలను విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, యువకులు, అభిమానులు పాల్గొని నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు తెలిపారు.

# మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ జన్మదిన వేడుకలు

## పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కమ్యూనిటీ పారా మేడిక్ వైద్యుల ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ ఉక్కుల అశోక్

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 11:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షులు మానకొండూర్ ఎమ్మెల్యే గౌరవ నీయులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారి జన్మదినోత్సవం సందర్భంగా తెలం గాణ రాష్ట్రకమ్యూనిటీపారా మెడిక్ వైద్యుల ఐక్యవేదిక రాష్ట్రఅధ్యక్షులు డా.ఉక్కుల అశోక్ మరి యు రాష్ట్రఉపాధ్యక్షులు డాక్టర్ భీమనాధుని సదానందం రాష్ట్ర నాయకులు డాక్టర్ శ్రీనివాస్ టీ పీసీసీ సేవాదళ్ బ్రిగేడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి తెలంగాణ రాష్ట్రదళిత నాయకులు ఆడెపు త్యాగరాజ్ తదితరులు మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, తెలంగాణ రాష్ట్రఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గారినితన నివాసంలో కలిసి పుట్టిన రోజు సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి వర్గ సమావేశం నిర్వహణ

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 11:**




నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామంలోని సోమేశ్వర శివజ్ఞాన పీఠంలో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి నల్గొండ జిల్లా ఆధ్వర్యంలో మాతృశక్తి వర్గ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన తెలంగాణ ప్రాంత మాతృశక్తి సంయోజకురాలు ఎంసీ పద్మశ్రీ మాట్లాడుతూ, దేశం అభివృద్ధి చెందాలంటే కుటుంబ వ్యవస్థ బలోపేతం కావాలని, కుటుంబం బాగుండాలంటే ప్రతి వ్యక్తి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ ఉన్నతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.దేశంలో నెలకొన్న సామాజిక పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ, మహిళలు మరియు యువత ఎదుర్కొనే వివిధ సవాళ్ల గురించి వివరించారు. సమాజంలో అప్రమత్తత, సంస్కార విలువలు పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెప్పారు. అలాగే మాతృశక్తి కార్యవిస్తరణలో భాగంగా బాల సంస్కార కేంద్రాలు, సత్సంగ కార్యక్రమాలను నియమితంగా నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో తెలంగాణ ప్రాంత మాతృశక్తి సహ సంయోజకురాలు శ్రీవాణి, జిల్లా కార్యదర్శి జూకూరి సంపత్ వర్మ, నార్కట్‌పల్లి ప్రకండ అధ్యక్షుడు దాసరి వీరమల్లు, ఉపాధ్యక్షుడు సోమ వెంకట్ రెడ్డి, కల్పన, సులోచన, సంధ్యారాణి, నాగమణి, శోభారాణి, భవాని, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# దోసపాటి సత్యనారాయణ మృతికి చిరుమర్తి లింగయ్య నివాళి



**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 11:**

నల్గొండ పట్టణానికి చెందిన దోసపాటి సత్యనారాయణ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వారి నివాసానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా దోసపాటి సత్యనారాయణ మృతదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# అబద్దాలతో లబ్దిదారుల మోసం చేస్తున్న ప్రభుత్వం

- ఇచ్చిన హామీలు వెంటనే అమలు చెయ్యాలి
- గుండు వెంకటనర్సు
- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి

**మోత్కూర్, జూన్ 11,వెలుతురు న్యూస్ :**



జూన్ 2 న కొత్తగా రెండు లక్షల మందికి ఆసరా కొత్త పెంక్షన్లు మంజూరు చేస్తామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం రోజున మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ.... 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిపేస్టో లో వృద్దులకు వితంతువులకు ఇస్తున్న ఆసరా 2000 రూపాయల పెంక్షన్ రూ 4016 లు, వికలాంగులకు ఇస్తున్న 3000 ల పెంక్షన్ రూ 6000 లకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాపాలన పేరుతో అర్హులైన వారినుండి చేయూత కొత్త పెంక్షన్ కోసం ధరకాస్తులు తీసుకున్నారని తెలిపారు. ఇప్పటికి దాదాపు ముప్పై నెలలు గడచిన వారికి కొత్త పెంక్షన్ మంజూరు చేయలేదని, రాష్ట్ర ముఖ్యమంత్రి గారు స్వయంగా జూన్ 2 న రాష్ట్రంలో రెండు లక్షల మందికి కొత్త పెంక్షన్లు మంజూరు చేస్తామని ప్రకటించి మాట తప్పారని అన్నారు. ప్రభుత్వ ప్రకటన నేపథ్యంలో లబ్ధిదారులు కొత్తగా ఆసరా పెంక్షన్ మంజూరు కోసం మళ్ళీ దరకాస్తు చేసుకున్నప్పటికి కొత్త పెంక్షన్లు మంజూరు చేయలేదని, తక్షణమే కొత్త పెంక్షను మంజూరు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బాల్యం పిల్లల హక్కు

## ఎంపీడీఓ బాలాజీ నాయక్




**మోత్కూర్, జూన్ 11,వెలుతురు న్యూస్ :**

బాల్యం పిల్లల హక్కు అని వారి హక్కులు కాపాడటం మన అందరి బాధ్యత అని ఎంపీడీఓ బాలాజీ నాయక్ తెలిపారు.ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా "స్కోప్"స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మోత్కూర్లొ జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతు బాల కార్మికుల నిర్మూలన, అక్రమ రవాణా, డ్రగ్స్ నివారణ, బాల్య వివాహేల నిర్మూలన, డ్రాప్ అవుట్ తదితర విషయాలను వివరిస్తూ బాల్యం పిల్లల హక్కు అని బాలల హక్కులు కాపాడటం మన అందరి బాధ్యత అని అన్నారు. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు .ఈ కార్యక్రమంలో జి. ప. ఉ. పా. ప్రధానోపాధ్యాయులు అరవిందరాయుడు, CWC మెంబర్ కునగళ్ల మల్లేశం, రిటైర్డ్ టీచర్ అవిలిమల్లు, అంగన్వాడి సూపర్వైజర్ CH.జ్యోతి, బీసీ సంఘం ప్రతినిధి కలిమెల నర్సయ్య, TS UTF మండల అధ్యక్షులు దర్శనం వెంకన్న, ఉపాధ్యాయులు రాంబాబు,బీసీ రిజర్వేషన్ సాధన సమితి మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్, డాక్టర్ L రఘువర్ధన్, నర్సింగరావు, స్కోప్ సంస్థ మండల కోఆర్డినేటర్ కురిమేటి యాదయ్య, ప్రతినిధి కే.అశ్విని, స్థానిక అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# శ్రీ కట్టా మైసమ్మ దేవస్థానం వద్ద కుమ్మరుల నిరసన దీక్ష

- కుమ్మర పూజారుల హక్కులను కాపాడాలని డిమాండ్ -రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం

**నాగర్ కర్నూల్, జూన్ 11 (వెలుతురు):**



నగర్ కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం లత్తిపూర్ గ్రామంలోని శ్రీ కట్టా మైసమ్మ దేవస్థానం వద్ద కుమ్మర పూజారుల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం (TRKS) ఆధ్వర్యంలో గురువారం నిరసన దీక్ష నిర్వహించారు.1947 సంవత్సరం నుంచి కుమ్మరులు ఆలయ నిర్మాణం, కట్టా తెగ కుండల తయారీతో పాటు పూజారులుగా సేవలందిస్తూ వస్తున్నారని సంఘ నాయకులు తెలిపారు. బోనం, దీపం, ధూపం, నైవేద్యం వంటి ఆలయ సంప్రదాయ కార్యక్రమాలను తరతరాలుగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. 2023లో ఆలయ ట్రస్ట్ ఏర్పాటైనప్పటి నుంచి కూడా కుమ్మరులే పూజారులుగా కొనసాగుతున్నారని వివరించారు.అయితే గ్రామంలోని కొందరు వ్యక్తులు రాజకీయ కక్షలతో పాలక మండలిని ఏర్పాటు చేసి, కుమ్మరులు పూజారులుగా ఉండరాదని అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వివాదం తలెత్తిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆలయ వద్ద కుమ్మర పూజారులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిరసన దీక్ష చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం మాట్లాడుతూ, కుమ్మరుల సంప్రదాయ హక్కులను హరించే ప్రయత్నాలను సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.

తరతరాలుగా కొనసాగుతున్న పూజారిత్వ హక్కులను కాపాడేందుకు సంఘం అండగా నిలుస్తుందని, న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.నిరసన సందర్భంగా పోలీసు అధికారులు జోక్యం చేసుకుని స్థానిక ఎమ్మెల్యే, ఎండోమెంట్ అధికారులు, ఈఓతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం సంఘ నాయకులు ఎమ్మెల్యేతో ఫోన్‌లో మాట్లాడగా, ఆయన సానుకూలంగా స్పందించి చర్చలకు ఆహ్వానించడంతో నిరసన దీక్షను తాత్కాలికంగా విరమించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు కె. రాంచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి నాగపూరి నాగేష్, సహాయ కార్యదర్శి జిల్లాల శంకరయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శులు అగిరిశెట్టి వీరన్న, నిమ్మలూరి శ్రీనివాస్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వి. రఘుబాబు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు కె. బుగ్గన్న, వనపర్తి జిల్లా నాయకులు, మాజీ జడ్పీటీసీ మామిడి బాలయ్య, హైదరాబాద్ నాయకులు మధునాగుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి సుమారు 600 మంది కుమ్మర కులస్థులు, మహిళలు, ఆలయ పూజారులు హాజరై నిరసన దీక్షను విజయవంతం చేశారు.

# రైతన్నలారా..... ఇకనైనా మారండి

- 50 లక్షల బడ్జెట్ లో రూ.2 లక్షల కోట్లు యూరియాకు ఖర్చు చేస్తున్నాం
- రూ.1.20 లక్షల కోట్ల సొమ్ముతో విదేశాలకు పంపి యూరియా దిగుమతి చేసుకోవడం బాధాకరం

**జమ్మికుంట వెలుతురు జూన్ 11:**

రసాయన ఎరువుల ద్వారా పండిస్తున్న పంటలను కొని తినడమంటే... పైసలిచ్చి రోగాలను కొని తెచ్చుకోవడమేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రైతులంతా రసాయన ఎరువుల వాడకాన్ని విడనాడి ప్రక్రుతి వ్యవసాయంపై ద్రుష్టి సారించాలని కోరారు. ప్రక్రుతి వ్యవసాయం ద్వారా వచ్చే పంటకు మద్దతు ధర రాదనే బాధ అక్కర్లేదన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేసిన రైతులు కోటీశ్వరులు అయ్యే అవకాశముందన్నారు. కోటి మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవు మళ్లించడమే ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమన్నారు. మోదీ 4400 రోజుల పాలన పూర్తి నేపథ్యంలో ఆయన స్పూర్తితో రాబోయే రెండేళ్లలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 25 వేల మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవైపు మళ్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని క్రుషి విజ్ఞాన కేంద్రంలో ''ప్రకృతి వ్యవసాయంపై రైతుల సమ్మేళనం'' కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తోపాటు జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మీ, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శత్రు నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, కేవీకే వ్యవస్థాపక సభ్యులు విజయపాల్ రెడ్డి, సీనియర్ సైంటిస్టు వెంకటేశ్వర్ రావు, కిసాన్ మోర్చా నాయకులు మహిపాల్ రెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్ ను, ఎగ్జిబిషన్ ను పరిశీలించారు. భూమి పూజ చేశారు. మొక్క నాటారు. ప్రక్రుతి వ్యవసాయం చేస్తున్న రైతుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రక్రుతి వ్యవసాయాన్ని పెంపొందించేందరుకు క్రుషి విజ్ఞాన కేంద్రం చేస్తున్న క్రుషిపై ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్ ప్రసంగించారు. ముఖ్యాంశాలు.గోమాత, భూమాత, భరతమాత...ని నాదంతో మూడేళ్లపాటు 6 వేల 18 మంది రైతులతో 19 గ్రామాల్లో 10 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, రాబోయే రోజుల్లో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్న జమ్మికుంట క్రుషి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులను, సిబ్బందిని మనస్పూర్తిగా అభినందిస్తున్నా. ఈ దేశంలో కోటి మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయంవైపు మళ్లిస్తానని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపు స్పూర్తితో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రాబోయే రెండేళ్లలో 25 వేల మంది రైతులను ప్రక్రుతి వ్యవసాయం వైపు మళ్లిస్తా. జమ్మికుంట కేవీకే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.రసాయన ఎరువులతో వ్యవసాయం చేస్తూ అధిక పంట పండిస్తూ... రోగాలు కొని తెచ్చుకుంటున్నాం. ఉజ్బెకిస్తాన్ వంటి దేశం రసాయనాలు వాడటంవల్ల సర్వనాశనమైంది. దేశానికి అన్నపూర్ణగా విలసిల్లిన పంజాబ్ లో రసాయన ఎరువుల వాడకం ఎక్కువ కావడంవల్ల క్యాన్సర్ రోగులు ఎక్కువయ్యారు. క్యాన్సర్ రోగుల కోసం ప్రత్యేక ట్రైన్ వెళుతున్న ద్రుశ్యాలు అత్యంత బాధాకరం. గోమాతనే ఉదాహరణకు తీసుకోండి. రోజూ పాలు ఇస్తోంది. దానికి సరైన మేత, విశ్రాంతి ఇవ్వకుండా, కేవలం ఎక్కువ పాలు కావాలని బలవంతం చేస్తూ ఇంజక్షన్స్ ఇస్తే... ఏమవుతుంది? కొంతకాలం ఎక్కువ పాలిస్తుంది. తరువాత అది బలహీనపడిపోతుంది. పాల విషపూరితమవుతాయి. గోమాత పరిస్థితి విషమం అవుతుంది. అదే పరిస్థితి వ్యవసాయ భూమికి కూడా వర్తిస్తుంది. గడ్డి మందు తాగితే చనిపోతాం. అలాంటి మందును వ్యవసాయానికి వినియోగించడం ఎంత వరకు కరెక్టో ఆలోచించండి. ఇకనైనా మనం మారకపోతే భావితరాలు మనల్ని క్షమించబోవు. ఇప్పుడు మార్కెట్ లో ఏ వస్తువు కొనాలన్నా భయమేస్తోంది. బియ్యం, పప్పు, నూనె మొదలు పండ్ల దాకా అన్నీ కెమికల్స్. మామిడి పండు మార్కెట్ లో కొని తినడమంటే... పైసలిచ్చి రోగాన్ని కొని తెచ్చుకున్నట్లే తయారైంది. హైదరాబాద్ లో మామిడి కాయ తినడంవల్ల ఇద్దరు చనిపోయారు. గత 25 ఏళ్లుగా నాకు జ్వరం దగ్గు లేదు. కానీ హైదరాబాద్ లో పాలు తాగడంవల్ల పాయిజనై 5 రోజులపాటు బెడ్ కే పరిమితం కావాల్సి వచ్చింది. ఇలాంటి వ్యవసాయం మనకు అవసరమా? సమాజంలో రోగాలకు కారకులం మనమే. నివారణ చేయాల్సిన బాధ్యత మనదే. అందుకే నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో "రసాయన ఎరువులపై ఆధారాన్ని తగ్గించి, ప్రకృతి/సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం లక్ష్యంతో ముందుకు సాగుతోంది. దేశాన్ని "Natural Farming Hub"గా తీర్చిదిద్దేందుకు క్రుషి చేస్తోంది. ప్రత్యేక మిషన్ ను ఏర్పాటు



చేశారు. 2015లో పరంపరాగత్ కృషి వికాస్ యోజన (PKVY), PM-PRANAM, National Mission on Natural Farming వంటి పథకాలను ప్రవేశ పెట్టారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ జాతీయ మిషన్ (National Mission on Natural Farming) కు గతేడాది బడ్జెట్ లో ఏకంగా 2 వేల 481 కోట్ల రూపాయలను కేటాయించినం. దేశవ్యాప్తంగా 38,043 సేంద్రీయ వ్యవసాయ క్లస్టర్లు ఏర్పాటు చేసినం. కోటి మంది రైతులతో ప్రకృతి వ్యవసాయం చేయించడమే లక్ష్యంగా పనిచేస్తున్నం. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఏటా ఎకరానికి 4 వేల రూపాయల చొప్పున రెండేళ్ల పాటు ప్రోత్సాహక సహాయం అందిస్తున్నం. జీవామృతం, బీజామృతం తయారీపై రైతులకు నిరంతరం ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. ఫలితంగా ఇప్పటికే 20 లక్షల మందికిపైగా రైతులు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందారు. ప్రకృతి వ్యవసాయం చేయడమంటే మన దేశ సంపద ఇతర దేశాలకు తరలిపోకుండా కాపాడుకోవడమే అని విషయం కూడా మీరు తెలుసుకోవాలి. అదేమిటను కుంటున్నారా? రైతుల కోసం విదేశాల నుండి పెద్ద ఎత్తున ఎరువులు, పురుగు మందులను దిగుమతి చేసుకుంటున్నామని మీకు తెలుసా? ప్రతి ఏటా ఎరువుల సబ్సిడీ పేరుతో రైతులకు దాదాపు 2 లక్షల కోట్ల రూపాయలను మనం ఖర్చు చేస్తున్నామని మీకు తెలుసా? అందులో విదేశాల నుండి ఎరువులను తెప్పించుకునేందుకే ఏటా 1 లక్షా 20 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నామని మీకు తెలుసా? మన దేశ బడ్జెట్ 50 లక్షల కోట్ల రూపాయలైతే... అందులో 1 లక్షా 20 వేల కోట్ల సొమ్మును ఎరువుల దిగుమతి కోసమే విదేశాలకు చెల్లిస్తున్నాం. మోదీ గారొచ్చాక గత 12 ఏళ్లలో 18 లక్షల కోట్ల సొమ్మును మనం విదేశాలకు చెల్లించి ఎరువులు, పురుగు మందులు తెచ్చుకున్నామనే విషయం మీకు తెలుసా?అందుకే మోదీగారు మన ఆరోగ్యం కోసం, మన దేశ భవిత కోసం ఇటీవల పొదుపు పేరుతో సప్త సూత్రాలు చెప్పారు గుర్తుందా? అందులో ఎరువుల వాడకం తగ్గించాలని చెప్పే సూత్రం ఒకటి. ఇవిగాకుండా ముడి చమురు, ఎలక్ట్రానిక్స్, బంగారం, వంట నూనెలు కూడా ఇందులో ప్రధానంగా ఉన్నాయి. ఒక్క పెట్రోల్, డీజిల్ కోసమే ఏటా మనం 11 లక్షల 50 వేల కోట్ల రూపాయలను విదేశాలకు చెల్లిస్తూ దిగుమతి చేస్తున్నాం. ఫోన్లు, టీవీలు, స్మార్ట్ వాచీల పేరుతో ఏటా 7 లక్షల కోట్ల రూపాయలకుపైగా మన దేశ సొమ్మును విదేశాలకు చెల్లించి దిగుమతి చేసుకుంటున్నాం. ఇగ బంగారం కోసం ఏటా 6 లక్షల కోట్ల రూపాయలకుపైగా విదేశాలకు చెల్లిం దిగుమతి చేసుకుంటున్నాం. వాటిపై మోజుతో మనం కష్టపడి సంపాదించిన సొమ్మునంతా విదేశాలకు తరలిస్తున్నాం. అందుకే మన రూపాయి విలువ రోజురోజుకూ క్షీణిస్తూ డాలర్ విలువను పెంచుతున్నాం. ఇవన్నీ ఆలోచించిన తరువాతే మోదీగారు వాటిని దిగుమతి చేసుకోవడం తగ్గించుకోవాలని కోరుతున్నాం. అదే సమయంలో మేకిన్ ఇండియా పేరుతో స్వదేశీ వస్తువుల తయారీకి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. "మేక్ ఇన్ ఇండియా", "స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా'' పేరుతో పెద్ద ఎత్తున డబ్బులు ఖర్చు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా 2 లక్షల 23 వేలకుపైగా గుర్తింపు పొందిన స్టార్టప్‌లు ఏర్పడి వీటి ద్వారా 23 లక్షల 36 వేల మందికిపైగా ప్రత్యక్షంగా ఉద్యోగాలు వచ్చాయి. అందుకే తెలంగాణలోని రైతాంగాన్ని నేను కోరేదొక్కటే. ఇకనైనా రసాయన ఎరువులను విడనాడండి. ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లండి. మద్దతు ధర రాదనే విషయాన్ని పక్కనపెట్టండి.

కోటీశ్వరులు అయ్యే అవకాశముంది. సేంద్రీయ వ్యవసాయ పంటలను కొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మోదీ ప్రధాని బాధ్యతలు చేపట్టి 4,400 రోజులైంది. ఈ సందర్భంగా ప్రక్రుతి వ్యవసాయంపై విస్తృత అవగాహన కల్పించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రజలంతా ప్రక్రుతి వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు కొనడానికి సిద్ధంగా ఉన్నారు. రైతులంతా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేంద్రీయ పంటలు సాగు చేయాలని కోరుతున్నా. అట్లాగే ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటిపై సోలార్ ను ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నా.

# హుగ్గెల్లిలో బడిబాట కార్యక్రమం విజయవంతం

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలకు అవగాహన
- సర్పంచ్ విమల శ్రీనివాస్ రెడ్డి

**జహీరాబాద్ వెలుతురు జూన్ 11:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో గురువారం "బడిబాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని విద్యార్థుల చేరికలపై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారులను గుర్తించి ప్రీ–ప్రైమరీ తరగతుల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే మధ్యలో చదువు మానేసిన (డ్రాప్ అవుట్) విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, పెన్నులు, మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారం, ఇతర విద్యా సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు."బడిబాట – విద్యాబాట, ప్రతి పిల్లవాడు బడికి రావాలి, విద్యా హక్కు – ప్రతి ఒక్కరి హక్కు, ప్రభుత్వ బడి – పిల్లల భవిష్యత్తుకు బంగారు బాట" అనే నినాదాలను తల్లిదండ్రులకు తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు.ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడి, ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న సౌకర్యాలను వివరించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ క్రమంలో పలువురు తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై ఆసక్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పాలన 12 ఏళ్లు పూర్తి సందర్భంగా ప్రత్యేక పూజలు

## ఆత్మనిర్భర్ మహిళల ఆధ్వర్యంలో హనుమాన్ మందిరంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు



**జహీరాబాద్ వెలుతురు జూన్ 11:**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మహేంద్ర కాలనీ హనుమాన్ మందిరంలో ఆత్మనిర్భర్ మహిళా యోజన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.విశ్వ మాంగళ్య మహాసభ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ హస్బి పూర్ణిమ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేమారెడ్డి కాలనీ, మహేంద్ర కాలనీ, భారత్ నగర్, పస్తాపూర్ ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమాన్ చాలీసా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పఠనం, లలితా సహస్రనామ పారాయణం నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా హస్బి పూర్ణిమ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ అంకితభావంతో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణాన్ని పూర్తి చేసి దేశ ప్రజలకు అంకితం చేయడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, పారిశ్రామికాభివృద్ధి వంటి రంగాల్లో సహకారం అందిస్తోందని తెలిపారు.దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ శాంతి సౌభాగ్యాలతో జీవించాలని మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆత్మనిర్భర్ మహిళలు, స్థానిక భక్తులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# 49 వ డివిజన్ కురుమవాడలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**కరీంనగర్ వెలుతురు జూన్ 11:**

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్ కురుమవాడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి సహకారంతో, సీఎస్ఆర్ నిధుల ద్వారా మలయప్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మరియు యువతలో ఫిట్‌నెస్ పట్ల అవగాహన పెంపొందించేందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఆధునిక జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత అవసరమని, అందుకోసం ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి "ఫిట్ ఇండియా" పిలుపుకు అనుగుణంగా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రీడలు, వ్యాయామంపై దృష్టి సారించాలని కోరారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గారి సహకారంతో నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని మేయర్ పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనతో పాటు ఆరోగ్య, క్రీడా సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.సీఎస్ఆర్ నిధులను ప్రజా ప్రయోజనాలకు వినియోగిస్తూ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్న మలయప్ప ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసిన ఈ ఓపెన్ జిమ్‌ను మహిళలు, యువకులు, వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజా ఆస్తులను పరిరక్షిస్తూ వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని మేయర్ సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు గారు, స్థానిక కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ గారు, కార్పొరేటర్లు కర్రె పద్మ అనిల్ గారు, గాజే రమ శివరామ్ గారు, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు మరియు డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధత, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 11:**




కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో శానిటేషన్ వింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని వర్షాకాల ముందస్తు సన్నద్ధత, పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధాన నాలాలు, అంతర్గత మురుగు కాలువలలో పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గతంలో వర్షాలకు నీరు నిలిచిన లోతట్టు ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట శాశ్వత లేదా తాత్కాలిక మోటార్ పంపులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. జేసీబీలు, పూడికతీత యంత్రాల లభ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు.నగరంలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించే విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, స్వచ్ఛ ఆటోల పనితీరు మరియు రూట్ మ్యాపులను క్రమం తప్పకుండా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సేకరించిన చెత్తను సకాలంలో డంపింగ్ యార్డుకు తరలించి, బయోమైనింగ్, కంపోస్టింగ్ పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.మార్కెట్లు, ప్రధాన కూడళ్లు, వాణిజ్య ప్రాంతాల్లో రాత్రి వేళల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు, జవాన్లు, సూపర్‌వైజర్ల బయోమెట్రిక్ హాజరును కచ్చితంగా అమలు చేయాలని, వారికి గ్లోవ్స్, మాస్కులు, బూట్లు, రెయిన్‌కోట్లు వంటి రక్షణ పరికరాలను సకాలంలో అందజేయాలని అధికారులను ఆదేశించారు.వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్లను మరింత విస్తృతంగా నిర్వహించాలని, నిల్వ నీటి ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, గంబూసియా చేపలను వదలడం వంటి చర్యలను చేపట్టాలని సూచించారు. నగరంలోని అన్ని డివిజన్లలో వారానికొకసారి ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ, వ్యాధి ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.భారీ వర్షాలు, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వార్డు, సర్కిల్ స్థాయిలో 'మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్' ఏర్పాటు చేయాలని, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్, హెల్ప్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ప్రజల్లో స్వచ్ఛతపై మరింత అవగాహన పెంచేందుకు స్వయం సహాయక బృందాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మైక్ అనౌన్స్‌మెంట్లు నిర్వహించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, తడి–పొడి చెత్త వేరు చేయడం వంటి అంశాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని పేర్కొన్నారు. రోడ్లపై, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్న వ్యాపార సంస్థలు, నివాసితులపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధించి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అదేవిధంగా శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఐదు డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో పారిశుధ్య పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు ప్రతి అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ వింగ్ సిబ్బంది, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# 12 ఏళ్ల పాలనలో భారతదేశ దిశా దశ మార్చిన ప్రధాని మోదీ

- వికసిత్ భారత్ , దేశ అభివృద్ధి , ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ అడుగులు
- బిజెపి నేతలు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, చింతం శ్రీనివాస్

**కరీంనగర్ వెలుతురు జూన్ 11:**



12 ఏళ్లలో భారతదేశ దిశ దశ ను మోడీ ప్రభుత్వం మార్చిందని , వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా దేశాన్ని అన్ని రంగాలలో దూసుకుపోయే విధంగా తీర్చిదిద్ది , ప్రపంచంలోనే దేశానికి ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకోచ్చిన ఘనత మోదికే దక్కుతుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో 12 ఏళ్ల పాలనను పూర్తి చేసుకున్న నేపథ్యంలో తిమ్మాపూర్ బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం రోజున నల్లగోండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత్‌లో అత్యధిక కాలం నిరంతరంగా ప్రధాని పదవిలో కొనసాగిన నాయకుడిగా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న రికార్డును నరేంద్ర మోదీ అధిగమించి సరికొత్త చరిత్ర సృష్టించారని , దేశాన్ని మరింత కాలం ప్రధాని మోదీ పరిపాలించడానికి , దేవుడు ఆయురారోగ్యాలు ఇవ్వాలని ప్రార్థిస్తూ తిమ్మాపూర్ బిజెపి శ్రేణులు మోడీ పేరిట ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చన చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, చింతం శ్రీనివాస్ లు మాట్లాడుతూ "ప్రజా సేవ అనేది సుపరిపాలనకు అతిపెద్ద పరీక్ష అని, వినయం, అంకితభావంతో పనిచేసే వ్యక్తి మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పొందగలుగుతారని, ప్రధాని మోదీ ఆ విశ్వాసాన్ని చురగోన్నారు కాబట్టే 12 ఏళ్లుగా దేశాన్ని విజయవంతంగా పరిపాలిస్తున్నారని తెలిపారు.గడిచిన 12 ఏళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మారాయన్నారు. 2014లో దాదాపు 2 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు 4 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటేసిందన్నారు. ప్రపంచంలోనే ఐదవ ఆర్థిక శక్తిగా అవతరించిందన్నారు. ముఖ్యంగా 'యూపీఐ' ద్వారా దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. రికార్డు స్థాయిలో జాతీయ రహదారుల నిర్మాణం, బ్రాడ్–గేజ్ రైల్వే లైన్ల విద్యుదీకరణ (99% పైగా),వందే భారత్ రైళ్లు ,ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందించడం, దశాబ్దాలుగా దేశాన్ని పట్టిపీడిస్తున్న అనేక సమస్యలకు ముగింపు పలకడం, చారిత్రక బిల్లుల కు పరిష్కారం చూపెట్టింది మోదీ ప్రభుత్వమేనన్నారు. ఈ ప్రోగ్రాంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర ,తిమ్మాపూర్ మండల బిజెపి నాయకులు గొట్టిముక్కల తిరుపతిరెడ్డి,బోనాల మోహన్,కనుగంటి మధుకర్ రెడ్డి, గడ్డం అరుణ్ ,బుర్ర శ్రీనివాసగౌడ్, రాఘవరెడ్డ, వేల్పుల ఓదలు యాదవ్, జాడి రాజు,దోనపాటి ప్రదీప్ రెడ్డి,కామోర వెంకటేశ్,గట్టు రాజు చింతం సుమన్, బాలగోని వెంకటేశ్,కాల్వ శ్రీనివాస్ ,జంగ సునిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూముల రేట్ల పెంపుతో సామాన్యులపై కాంగ్రెస్ సర్కార్ భారం..!

- పట్టణాల్లో నాలుగు రెట్లు పెంచిన మార్కెట్ విలువలు వెంటనే తగ్గించాలి...
- బీఆర్ఎస్ నేత నామ రవికిరణ్

**జహీరాబాద్ వెలుతురు జూన్ 11:**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల భూముల ప్రభుత్వ మార్కెట్ విలువలను భారీగా పెంచడం ద్వారా సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని బీఆర్ఎస్ నాయకుడు నామ రవికిరణ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఎలాంటి శాస్త్రీయ అధ్యయనం లేకుండా, ప్రజల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోకుండా భూముల విలువలను విపరీతంగా పెంచడం వల్ల ఇళ్ల స్థలాలు కొనుగోలు చేయాలనుకునే కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని రాచన్నపేట్ ప్రాంతం (సర్వే నంబర్లు 173, 174)లో గతంలో గజానికి రూ.10 వేలుగా ఉన్న మార్కెట్ విలువను ప్రభుత్వం ఏకంగా రూ.40 వేలుకు పెంచిందని తెలిపారు. అదే విధంగా నాల్‌సాబ్ మొహల్లా, మార్కండేశ్వర్, హనుమాన్ వీధి, ఖాన్ మొహల్లా ప్రాంతాల్లో గజానికి రూ.4,100గా ఉన్న విలువను రూ.16,200లకు పెంచడం ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపే చర్య అని విమర్శించారు.భూముల విలువల పెంపు కారణంగా రిజిస్ట్రేషన్ ఖర్చులు, స్టాంప్ డ్యూటీ, ఇతర పన్నులు భారీగా పెరిగిపోయాయని, సాధారణ కుటుంబాలు సొంత ఇంటి కలను నెరవేర్చుకోవడం మరింత కష్టతరంగా మారిందన్నారు. రాచన్నపేట్ ప్రాంతంలో 200 గజాల స్థలం కొనుగోలు చేయాలంటే పెరిగిన మార్కెట్ విలువల ప్రకారం దాదాపు రూ.80 లక్షలు చట్టబద్ధమైన ఆదాయంగా చూపించాల్సి వస్తోందని, ఇది మధ్యతరగతి కుటుంబాలకు అసాధ్యమైన పరిస్థితిగా మారిందని పేర్కొన్నారు.ఒకవైపు పట్టణ ప్రాంతాల్లో భూముల రేట్లను నాలుగు రెట్లు పెంచిన ప్రభుత్వం, మరోవైపు రైతుల వ్యవసాయ భూములకు మాత్రం తగిన స్థాయిలో విలువలు పెంచలేదని రవికిరణ్ ఆరోపించారు. భవిష్యత్తులో భూసేకరణ చేపట్టే సందర్భంలో రైతులకు అధిక నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వ్యవసాయ భూముల విషయంలో వివక్ష చూపుతోందని విమర్శించారు.పట్టణాల్లోని అభివృద్ధి చెందిన ప్రాంతాలతో పాటు స్లమ్ ఏరియాల్లో సైతం నిబంధనలకు విరుద్ధంగా భూముల మార్కెట్ విలువలను పెంచడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపి ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు.ప్రభుత్వం వెంటనే పెంచిన భూముల మార్కెట్ విలువలను పునఃసమీక్షించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలపై పడుతున్న అదనపు భారం తొలగించి వారికి ఊరట కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నరేష్ రెడ్డి, వడ్డే శేఖర్, ఏక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలి: తపస్

**చేగుంట వెలుతురు జూన్ 11:**



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా వందరోజులలో సమస్యలు పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని తపస్ డిమాండ్ చేసింది. పంజాబ్ రాష్ట్రంలో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులందరినీ శాశ్వత ఉద్యోగులుగా పరిగణించింది. ఆ రాష్ట్ర ప్రభుత్వం ను ఆదర్శంగా తీసుకొని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. . ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి జిడ్డి ఎల్లం,జాల సిద్దు రాష్ట్ర నాయకులు చల్లా లక్ష్మణ్,మెతుకుపల్లి రంగారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# సముద్ర దాడులు అన్యాయం

- పశ్చిమాసియా చిచ్చుపై ఐరాసలో భారత్ గర్జన
- గల్ఫ్‌లోని భారతీయుల భద్రతే ముఖ్యమని వెల్లడి
- నౌకలను సైనిక లక్ష్యాలుగా మార్చడం నిబంధ నలకు విరుద్ధమన్న పర్వతనేని హరీశ్
- ప్రాంతీయ ఘర్షణల వల్ల ఇప్పటికే పలువురు భారతీయులు మృతి
- మరికొందరు అదృశ్యమైనట్లు గుర్తింపు
- సముద్ర రవాణా మార్గాలు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు జీవనాడి
- దాడులపై భారత్ తీవ్ర ఆందోళన
- భారతదేశ ఇంధన సరఫరా, వాణిజ్యం గల్ఫ్ స్థిరత్వంపైనే ఆధారపడి ఉన్నాయని స్పష్టం
- యుద్ధాలు, సైనిక చర్యల కంటే చర్చల ద్వారానే సంక్షోభానికి శాంతియుత పరిష్కారం
- పౌరులు, కీలక మౌలిక వసతులపై దాడులు ఆపాలని ఢిల్లీ డిమాండ్
- ఆర్థిక సంక్షోభాలు, ఉగ్రవాదం లాంటి ఆధునిక సవాళ్లకు అనుగుణంగా ఐరాస మారాలని సూచన
- యుద్ధాల వల్ల మహిళలు, చిన్నారులకే భారీ నష్టం
- వివాదాల పరిష్కారంలో మానవతా దృక్పథానికి ప్రాధాన్యం

**పశ్చిమాసియా వెలుతురు జూన్ 11:**

పశ్చిమాసియాలో రోజురోజుకూ ముదురుతున్న ఘర్షణలు, గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న యుద్ధ వాతావరణంపై భారతదేశం అంతర్జాతీయ వేదికపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సముద్ర రవాణా మార్గాలలో అంతర్జాతీయ వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి (ఐరాస) భద్రతా మండలిలో జరిగిన 'అంతర్జాతీయ శాంతి, భద్రత పరిరక్షణ – పశ్చిమాసియాలో రాజకీయ పరిష్కారాలు, మధ్యవర్తిత్వం, శాశ్వత శాంతి కోసం సంభాషణ' అనే అత్యవసర చర్చా కార్యక్రమంలో ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ పాల్గొని దేశం తరపున గట్టి వాయిస్ వినిపించారు. ప్రాంతీయ శాంతి భద్రతలను కాపాడటానికి ప్రపంచ దేశాలన్నీ పంతాలు వీడి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రపంచవ్యాప్తంగా సాగే సముద్ర వాణిజ్యంలో, నౌకాయాన రంగంలో భారతీయ నావికులు, సిబ్బంది అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నారని పర్వతనేని హరీశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇలాంటి తరుణంలో కేవలం తమ స్వార్థ ప్రయోజనాల కోసం అంతర్జాతీయ వాణిజ్య నౌకలను సైనిక లక్ష్యాలుగా మార్చుకుని దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు మరియు నౌకాయాన నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ ప్రాంతీయ ఘర్షణల కారణంగా ఇప్పటికే పలువురు అమాయక భారతీయులు తమ ప్రాణాలను కోల్పోయారని, మరికొందరు సిబ్బంది అదృశ్యమైనట్లు తమకు సమాచారం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సముద్ర రవాణా మార్గాలు అనేవి ప్రపంచ దేశాల మధ్య జరిగే అంతర్జాతీయ వాణిజ్యానికి ప్రధాన జీవనాడి లాంటివని భారత్ స్పష్టం చేసింది. వీటిపై నిరంతరం దాడులు చేయడం వల్ల ప్రపంచ సరఫరా గొలుసు (సప్లై చైన్) దెబ్బతిని, వస్తువుల ధరలు పెరిగి అంతిమంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థే కుప్పకూలే ప్రమాదం ఉందని హెచ్చరించింది. అందువల్ల నౌకాయాన స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకాలు కలిగించకుండా చూడాల్సిన బాధ్యత ఐక్యరాజ్యసమితితో పాటు అన్ని ప్రాంతీయ దేశాలపై ఉందన్నారు. వాణిజ్య నౌకలను యుద్ధ క్షేత్రాలుగా మార్చడాన్ని భారత్ ఎంతమాత్రం అంగీకరించబోదని తేల్చి చెప్పారు.పశ్చిమాసియాలో శాంతి నెలకొనడం భారతదేశానికి ఎందుకు ముఖ్యమో వివరిస్తూ



పర్వతనేని హరీశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం గల్ఫ్ పరిధిలోని వివిధ అరబ్ దేశాలలో దాదాపు కోటి మందికి పైగా భారతీయ పౌరులు నివసిస్తూ, వివిధ రంగాలలో ఉపాధి పొందుతున్నారు. అక్కడ నివసిస్తున్న మా భారతీయుల రక్షణ, వారి సంక్షేమమే మా ప్రభుత్వానికి అన్నింటికంటే అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రధాన అంశం. అదేవిధంగా భారతదేశానికి అవసరమైన ముడిచమురు, ఇంధన సరఫరా మరియు వాణిజ్య వ్యవస్థలన్నీ ఈ గల్ఫ్ ప్రాంత స్థిరత్వంపైనే ఆధారపడి ఉన్నాయి. ఇక్కడ అస్థిరత ఏర్పడితే భారత ఆర్థిక ప్రయోజనాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది" అని ఆయన వివరించారు.పశ్చిమాసియాలో ప్రస్తుత ఘర్షణలు తగ్గకపోగా మరింత తీవ్రరూపం దాల్చడం, ఒక దేశం నుండి ఇతర పొరుగు దేశాలకు విస్తరించడం ప్రపంచ వ్యాప్తంగా అందరినీ కలవరపెడుతోందని భారత్ పేర్కొంది. నిత్యం పెరుగుతున్న ప్రాణనష్టం, ఆస్తుల విధ్వంసం, సాధారణ ప్రజల జీవనం పూర్తిగా స్తంభించిపోవడం, ఆర్థిక కార్యకలాపాలు ఆగిపోవడం వంటి భయంకరమైన పరిణామాలు అక్కడి స్థానిక ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం భారత్‌కు భౌగోళికంగా చాలా సమీపంలో ఉండటం, తమ రక్షణ మరియు ఆర్థిక ప్రయోజనాలు దీనితో ముడిపడి ఉండటంతో ఢిల్లీ ఈ పరిణామాలను అత్యంత సున్నితంగా, నిశితంగా గమనిస్తోందని స్పష్టం చేశారు.ప్రస్తుతం నెలకొన్న ఈ భీకర సంక్షోభానికి కేవలం సైనిక చర్యలు, క్షిపణి దాడుల వల్ల పరిష్కారం లభించదని, శాంతియుత దౌత్య చర్చల ద్వారానే సమస్యలు సమసిపోతాయని పర్వతనేని హరీశ్ మరోసారి ప్రపంచ దేశాలకు గుర్తుచేశారు. తక్షణమే యుద్ధాలు ఆపి, సంభాషణ మరియు దౌత్యపరమైన వేదికలపైకి రావాలని సూచించారు. యుద్ధాల్లో అమాయక పౌరులు, వారి నివాస ప్రాంతాలు, ఆసుపత్రులు, కరెంట్, నీటి సరఫరా లాంటి కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరారు. పశ్చిమాసియాలో శాంతిని పునరుద్ధరించడానికి అంతర్జాతీయంగా జరిగే అన్ని రకాల మధ్యవర్తిత్వ ప్రయత్నాలకు భారత్ తన సంపూర్ణ మద్దతు ఇస్తుందని వెల్లడించారు.పశ్చిమాసియా ప్రజలు కూడా ప్రపంచంలోని ఇతర దేశాల ప్రజల వలె నిరంతర శాంతికి, సాధారణ జీవన పరిస్థితులకు పూర్తిగా అర్హులని హరీశ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం ఆర్థిక సంక్షేమాలు, జనాభా ఒత్తిళ్లు, ఉగ్రవాదం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల వల్ల తలెత్తుతున్న సరికొత్త డిజిటల్ ముప్పులను ఎదుర్కొంటోందని చెప్పారు. ఇలాంటి మారుతున్న ఆధునిక కాల సవాళ్లకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి మరియు దాని భద్రతా మండలి మరింత చురుకుగా, పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ఐరాసలోని అంతర్జాతీయ భద్రతా వ్యవస్థలు కాలానుగుణంగా పాత నిబంధనలను మార్చుకుని కొత్త సంస్కరణలను స్వీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.ఏ దేశాల మధ్య యుద్ధాలు, సాయుధ ఘర్షణలు జరిగినప్పటికీ, అందులో తుపాకీ గుళ్లకు, బాంబు దాడులకు సమాజంలోని మహిళలు, చిన్నారులు, వృద్ధులు మరియు ఇతర బలహీన వర్గాలే అత్యధికంగా బలైపోతున్నారని హరీశ్ గుర్తుచేశారు. అందువల్ల ఎలాంటి అంతర్జాతీయ వివాదాలనైనా పరిష్కరించే సమయంలో దేశాలు తమ అహాలను పక్కనబెట్టి "మానవతా దృక్పథానికి" మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కేవలం సరిహద్దులు, ఆధిపత్యం మాత్రమే కాకుండా ప్రజల ప్రాణాలు, వారి జీవనోపాధి, నిరుపేదల భద్రతలను కేంద్రంగా ఉంచుకుని నిర్ణయాలు తీసుకున్నప్పుడే ప్రపంచంలో శాశ్వత శాంతి సాధ్యమవుతుందని భారత్ తరపున ఐరాస భద్రతా మండలికి పటిష్టమైన సందేశాన్ని అందించారు.

# పేద ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

- వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:00 వరకు ఆరోగ్య సేవలు అందించాలి
- వివిధ ఆరోగ్య కార్యక్రమాలు, పథకాలలో ప్రగతిని సాధించి హైదరాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలి
- డా: పుట్ల శ్రీనివాస్, జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి




**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**

పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందాలని ఆ దిశగా వైద్యాధికారులు నిబద్ధతతో పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్టా శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం జిల్లాలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవఖాన లోని వైద్యుల తో అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం యశోద హాస్పిటల్ సికింద్రాబాద్ ఆడిటోరియం, ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఆసుపత్రులకు వచ్చే వారికి ఓపి సేవలు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఓపి నిర్వహించాలని సూచించారు .ఆరోగ్య కార్యక్రమాలపై జిల్లా కార్యాలయం నుండి సమాచారం పంపిస్తే వెంటనే స్పందించాలని , సకాలంలో కార్యక్రమాల నివేదికలు జిల్లా కార్యాలయానికి/ పంపాలని వైద్యాధికారులకు సూచించారు. అన్ని రకాల మందులు, అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.వచ్చే వర్షాకాలం సీజన్ లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు పరిశుభ్రంగా ఉంచాలని అలాగే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. వైద్యాధికారులు ప్రతిరోజు స్వయంగా ఓపి రోగుల సేవలను చూసి ఓపి రిజిస్టర్ లో స్వయంగా నమోదు చేయాలని సూచించారు.డయాగ్నొస్టిక్ సేవలు అన్ని ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని , అవసరమైన రోగులకు అన్ని రకాల పరీక్షలు చేసి రిపోర్ట్స్ వెంటనే అందించాలని సూచించారు. అత్యవసర రోగులకు ప్రథమ చికిత్స చేసి రిఫర్ చేయాలని , ఏదైనా ప్రమాదానికి గురైన వారికి పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ప్రథమ చికిత్స చేసి రిఫర్ చేయాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాలు చేపట్టి వ్యాధుల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి వివరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా. శ్రీధర్, డా. సాయిబాబా, డా, శ్రీకళ , సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్, వైద్యాధికారులు , జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఇగ్నైట్' పేరుతో రూ.5 వేల కోట్ల మోసం కుట్ర భగ్నం

- క్యూనెట్ కొత్త అవతారాన్ని బయట పెట్టిన సీపీ సజ్జనార్
- గతంలో నిషేధానికి గురైన క్యూనెట్‌పై మరోసారి హెచ్చరిక
- 'గోల్డ్ క్వెస్ట్', 'క్వెస్ట్‌నెట్', 'క్యూనెట్' నుంచి 'ఇగ్నైట్'గా మారిన సంస్థ
- అమాయకులను లక్ష్యంగా చేసుకుని భారీ మోసం యత్నం
- రూ.5 వేల కోట్ల విలువైన కుట్రను అడ్డుకున్న పోలీసులు
- దేశవ్యాప్తంగా లక్షలాది మంది బాధితులు ఉన్నట్లు వెల్లడి
- అధిక లాభాల పేరుతో యువతను ఆకర్షిస్తున్న ముఠాలు
- ఇలాంటి నెట్‌వర్క్ మార్కెటింగ్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- మామిడిపండ్లు తిని బాలికలు మృతిచెందిన ఘటనపైనా స్పందన
- వైద్య నిపుణులతో విచారణ కొనసాగు తోందన్న సీపీ
- బాలికల మరణాలకు అసలు కారణాలను గుర్తిస్తామని హామీ

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**

హైదరాబాద్‌లో భారీ ఆర్థిక మోసానికి సంబంధించిన కీలక వివరాలను నగర పోలీసు కమిషనర్ సీపీ ఆనంద్? కాదు, సీపీ సజ్జనర్ వెల్లడించారు. గతంలో పలు పేర్లతో కార్యకలాపాలు నిర్వహించి వివాదాస్పదంగా మారిన క్యూనెట్ సంస్థ ప్రస్తుతం 'ఇగ్నైట్' పేరుతో మరోసారి



ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆయన తెలిపారు. దాదాపు రూ.5 వేల కోట్ల విలువైన భారీ మోసం కుట్రను పోలీసులు భగ్నం చేసినట్లు వెల్లడించారు.గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ నెట్‌వర్క్ గత 25 ఏళ్లుగా వివిధ పేర్లతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. తొలుత 'గోల్డ్ క్వెస్ట్', అనంతరం 'క్వెస్ట్‌నెట్', తరువాత 'క్యూనెట్' పేర్లతో వ్యవహరించిన సంస్థ ప్రస్తుతం 'ఇగ్నైట్' పేరుతో కొత్తగా రంగంలోకి దిగిందని తెలిపారు. పేర్లు మారినా మోసపూరిత వ్యాపార విధానాలు మాత్రం మారలేదని పేర్కొన్నారు.అధిక లాభాలు, తక్కువ కాలంలో సంపాదన, విదేశీ వ్యాపార అవకాశాలు వంటి ఆకర్షణీయమైన హామీలతో యువత, నిరుద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని ఈ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోందని సీపీ తెలిపారు. సభ్యత్వ రుసుములు, పెట్టుబడుల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించి అనంతరం ప్రజలను నష్టాల్లోకి నెట్టేస్తున్నట్లు వివరించారు.దేశవ్యాప్తంగా ఈ సంస్థల బారిన పడి లక్షలాది మంది నష్టపోయినట్లు ప్రాథమిక అంచనాలు సూచిస్తున్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత, త్వరగా డబ్బు సంపాదించాలని భావించే వారిని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి సంస్థలు వల వేస్తున్నాయని హెచ్చరించారు. ఎవరైనా అధిక లాభాల పేరుతో పెట్టుబడులు కోరితే ముందుగా సంబంధిత సంస్థల చట్టబద్ధతను పరిశీలించాలని సూచించారు.ప్రజలు సామాజిక మాధ్యమాలు, వాట్సాప్ గ్రూపులు, ఆన్‌లైన్ సమావేశాల ద్వారా వచ్చే పెట్టుబడి ఆహ్వానాల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సీపీ పేర్కొన్నారు. తక్కువ సమయంలో భారీ ఆదాయం వస్తుందని చెప్పే పథకాలపై అనుమానం వ్యక్తం చేయాలని, అవసరమైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఆర్థిక మోసాలపై అవగాహన పెరగడం ద్వారా మాత్రమే ఇలాంటి నేరాలను అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా, ఇటీవల నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని విఠల్‌వాడిలో చోటుచేసుకున్న ఇద్దరు బాలికల మృతిపై కూడా సీపీ స్పందించారు. మామిడిపండ్లు తిన్న అనంతరం అస్వస్థతకు గురై అక్కాచెల్లెళ్లు మృతిచెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగించిందన్నారు. ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యంతో విచారిస్తున్నట్లు తెలిపారు.బాలికల అంతర్గత అవయవాల నమూనాలను భద్రపరచాలని ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. సంఘటనకు దారితీసిన పరిస్థితులపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఆహార పదార్థాలు, వైద్య నివేదికలు, ఫోరెన్సిక్ ఆధారాలను సమగ్రంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కేసులో వైద్య నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకుంటున్నామని సీపీ తెలిపారు. బాలికల మరణాలకు అసలు కారణం ఏమిటో శాస్త్రీయ ఆధారాలతో నిర్ధారించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఎలాంటి ఊహాగానాలకు తావు లేకుండా పూర్తి స్థాయి విచారణ అనంతరం నిజాలు వెలుగులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.ప్రజలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మవద్దని సీపీ సూచించారు. అధికారిక నివేదికలు వచ్చే వరకు ఓపికగా ఉండాలని, విచారణకు సహకరించాలని కోరారు. బాలికల మరణాల వెనుక ఉన్న వాస్తవాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఒకవైపు భారీ ఆర్థిక మోసాలపై హెచ్చరికలు జారీ చేస్తూనే, మరోవైపు ప్రజల ప్రాణాలకు సంబంధించిన సున్నితమైన ఘటనలపై కూడా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని సీపీ తెలిపారు. ప్రజల భద్రత, ఆర్థిక రక్షణ, న్యాయ పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

# గృహిణులు దేశ నిర్మాతలు

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ప్రమాద పరిహారాల్లో గృహిణుల సేవలకు ఆర్థిక విలువ
- నెలకు రూ.30 వేల ఆదాయంగా పరిగణించాలని ఆదేశం
- హోమ్‌మేకర్ కంటే 'నేషన్ బిల్డర్' అనే గుర్తింపు అవసరం
- కుటుంబాల ఎదుగుదల వెనుక మహిళల శ్రమే పునాది
- మోటారు ప్రమాద కేసుల్లో పరిహార లెక్కింపుకు కొత్త మార్గదర్శకం
- గృహ నిర్వహణ సేవలను నష్టంగా గుర్తించిన ధర్మాసనం
- జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటేశ్వర్ సింగ్ కీలక వ్యాఖ్యలు
- పరిహారాల విషయంలో ఇన్సూరెన్స్ సంస్థలపై ప్రభావం
- వేలాది పెండింగ్ క్లెయిమ్ కేసులకు వర్తించే అవకాశం
- మహిళల శ్రమకు చట్టపరమైన గౌరవం దక్కిందంటూ హర్షం

**న్యూఢిల్లీ వెలుతురు జూన్ 11:**

ఇంటిని నడిపిస్తూ కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించే గృహిణుల పాత్రను దేశ అత్యున్నత న్యాయస్థానం విశేషంగా కొనియాడింది. గృహిణులను కేవలం ఇంటి పనులు చూసుకునే వ్యక్తులుగా కాకుండా, దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే 'దేశ నిర్మాతలు'గా గుర్తించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. మహిళలు ఇంట్లో అందించే సేవలకు సమాజం తగిన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.రోడ్డు ప్రమాద పరిహారాల లెక్కింపుకు సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రమాదంలో గృహిణి మరణించినా లేదా తీవ్రంగా గాయపడినా, ఆమె కుటుంబానికి అందించిన గృహ నిర్వహణ సేవలను ఆర్థిక నష్టంగా పరిగణించాలని ధర్మాసనం పేర్కొంది. ఇందుకోసం నెలకు రూ.30 వేల ఆదాయాన్ని ప్రాథమికంగా లెక్కలోకి తీసుకుని పరిహారం నిర్ణయించాలని సూచించింది.జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం గృహిణుల సేవలు అమూల్యమైనవని వ్యాఖ్యానించింది. కుటుంబ సభ్యులు విద్య, ఉద్యోగాలు, వ్యాపారాల్లో విజయాలు సాధించడానికి ఇంట్లో మహిళలు అందించే మద్దతు కీలకమని పేర్కొంది. దేశ ఆర్థిక, సామాజిక పురోగతిలో వారి పాత్ర ప్రత్యక్షంగా కనిపించకపోయినా అత్యంత విలువైనదని అభిప్రాయపడింది.ఇకపై 'హోమ్‌మేకర్' అనే పదానికి బదులుగా 'నేషన్ బిల్డర్' అనే గౌరవప్రదమైన గుర్తింపును ఉపయోగించాలని సుప్రీంకోర్టు సూచించింది. గృహిణుల శ్రమ కేవలం కుటుంబానికే కాకుండా సమాజానికి, దేశానికి కూడా ఉపయోగపడుతుందని పేర్కొంది.ఈ తీర్పు 2001లో జరిగిన ఒక రోడ్డు ప్రమాద కేసుకు సంబంధించిన అప్పీల్



విచారణలో వెలువడింది. గతంలో మంజూరైన పరిహారం తక్కువగా ఉందని బాధిత కుటుంబం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, కేసును సమగ్రంగా పరిశీలించిన ధర్మాసనం తాజా మార్గదర్శకాలను జారీ చేసింది.న్యాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ తీర్పు దేశవ్యాప్తంగా మోటారు ప్రమాద క్లెయిమ్‌ల విచారణపై గణనీయమైన ప్రభావం చూపనుంది. ముఖ్యంగా గృహిణుల మరణాలకు సంబంధించి పరిహారాల లెక్కింపులో కొత్త ప్రమాణాలు అమలులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో బాధిత కుటుంబాలకు గతంతో పోలిస్తే అధిక నష్టపరిహారం లభించే అవకాశాలు మెరుగుపడనున్నాయి.మహిళా సంఘాలు, సామాజిక సంస్థలు ఈ తీర్పును స్వాగతిస్తున్నాయి. ఎన్నాళ్లుగానో గుర్తింపు కోసం ఎదురుచూస్తున్న గృహిణుల శ్రమకు చట్టపరమైన గౌరవం దక్కిందని వారు అభిప్రాయపడుతున్నారు. గృహిణుల సేవలను దేశ నిర్మాణంతో అనుసంధానిస్తూ సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు మహిళల సామాజిక స్థాయిని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొంటున్నారు.

## నామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం మరియు కరపత్రం విడుదల



**గట్టుప్పల్ వెలుతురు జూన్ 11:**

నల్గొండ జిల్లా గట్టుప్పల్ మండలం నామాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మరియు ప్రభుత్వ ఉపాధ్యాయులు లింగయ్య మరియు ప్రదీప్ కుమార్ లో పాల్గొన్నారు ఈ సందర్భంగా కరపత్రాన్ని విడుదల చేసినారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని విద్యావంతులు కావాలని సమర్ధవంతమైన ఉపాధ్యాయులు ఉన్నారని మధ్యాహ్న భోజనము ఉచిత నోటి పుస్తకాలు పుస్తకాలు ప్రభుత్వ పథకాలు అందుతాయని ఈ సందర్భంగా గుర్తు చేసినారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వము ఎలాంటి పథకాలు అందవని గుర్తు చేసినారు. మన ఊరి విద్యార్థులు మనబడి లోనే చదవాలని రెండు మండలాలలో పదవ తరగతి విద్యార్థులు ప్రథమ స్థానంలో ఉన్నారని తెలిపినారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థికి గురుకులాల్లో గాని ఇతర ఐఐటి మరియు ట్రిబుల్ ఐటీ కళాశాలలో సీట్లు దొరుకుతాయని తెలియపరిచారు. పాఠశాలలో జూన్ మాసం 15 తారీకున పునర్ ప్రారంభ మవుతాయని తెలిపారు అదేవిధంగా పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం వాటిని విడుదల చేశాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంచుకట్ల సంపత్ , జాజుల యాదయ్య కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు సురిగి,వెంకటేష్ కంచుకట్ల కోటయ్య, అయితే రాజు జంగయ్య, జాజుల యాదయ్య, కంచుకట్ల సుభాష్ రాష్ట్ర కన్వీనర్ ఫ్లోరోసిస్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం , భీమనపల్లి రామయ్య సర్పంచ్, లగోని సంతు, లగ్గోని సైదులు, కంచుకట్ల రామకృష్ణ, కంచుకట్ల యాదయ్య దేవాలయ కమిటీ సభ్యులు నవీన్, నామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ , ఎల్ . సుమతి ,టీచర్ పురుషోత్తంరాజు ,రామకృష్ణ, లింగయ్య , నక్క వెంకటేశ్వర్లు, సునీత, శ్రీనివాసులు, ప్రదీప్ కుమార్,ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మి టీచర్లు విజయ, రమ తదితరులు పాల్గొన్నారు.

# వరద కష్టాలపై 'హైడ్రా' యాక్షన్ ప్లాన్

- రంగంలోకి కమిషనర్ రంగనాథ్
- ఇటీవలి భారీ వర్షానికి చెరువులుగా మారిన హైటెక్ సిటీ రోడ్లు..
- గంటల తరబడి నిలిచిపోయిన ఐటీ ఉద్యోగులు
- వరద ముంపు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలన
- అధికారులకు కీలక ఆదేశాలిచ్చిన హైడ్రా బాస్
- ఐకియా, గచ్చిబౌలి ప్రాంతాల వరద నీరుపై ప్రణాళికలు
- ఖాజాగూడ చెరువులోకి వెళ్లేలా అత్యవసర చర్యలు
- కాలువల్లో పూడికతీత పనులకు ఆదేశం
- వర్షాకాలం ముగిసేవరకు నిరంతరాయంగా పనులు
- వరద ముంపును శాశ్వతంగా అరికట్టేందుకు ప్రత్యేక 'మెట్ టీమ్‌లు'
- చెరువులు, నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల అను సంధానానికి సమగ్ర మాస్టర్ ప్లాన్
- మున్సిపల్, ఇరిగేషన్, హైడ్రా శాఖల ఉమ్మడి సమ న్వయానికి ఆదేశం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**

మహానగరం హైదరాబాద్‌లో ఇటీవల కురిసిన ఆకస్మిక భారీ వర్షం ఐటీ కారిడార్‌ను అతలాకుతలం చేసింది. రహదారులన్నీ చెరువులను తలపించడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాన నీరు రోడ్లపై నిలిచిపోవడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది.

ఈ నేపథ్యంలో నగరంలోని ఐటీ హబ్‌లో వరద ఇబ్బందులను శాశ్వతంగా తొలగించడంపై 'హైడ్రా' ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఐకియా, దుర్గం చెరువు, మాదాపూర్ పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు నేరుగా చెరువుల్లోకి వెళ్లకుండా రహదారులపైకి ఎందుకు వస్తోందనే అంశంపై హైడ్రా కసరత్తు ప్రారంభించింది.

### ఖాజాగూడ చెరువు వద్ద రంగనాథ్ తనిఖీలు

మంగళవారం కురిసిన కుండపోత వర్షానికి నగరంలో చాలా చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, వరద నీరు పోటెత్తడంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం స్వయంగా క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ఐటీ కారిడార్‌లోని ప్రధాన ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా ఖాజాగూడ చెరువుకు వరద నీటిని చేరవేసే ప్రధాన కాలువలను, నాలాలను ఆయన నడుచుకుంటూ వెళ్లి తనిఖీ చేశారు. ఐకియా, గచ్చిబౌలి బెల్ట్ నుంచి వచ్చే భారీ వరద నీరు ఎలాంటి అడ్డంకులు లేకుండా నేరుగా ఖాజాగూడ చెరువులోకి చేరేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు.

### వరద నీరు నేరుగా చెరువుల్లోకి వెళ్లాలి

పరిశీలన అనంతరం కమిషనర్ రంగనాథ్ అధికారులకు ఒక కీలకమైన సాంకేతిక సూచన చేశారు. నగరంలో సాధారణ రోజుల్లో వచ్చే మురుగు నీటిని (డొమెస్టిక్ సీవరేజ్) మాత్రమే ఎస్‌టీపీలకు (మురుగునీటి శుద్ధి కేంద్రాలు) మళ్లించాలని స్పష్టం చేశారు. వర్షాలు పడినప్పుడు వచ్చే భారీ వరద నీటిని ఎస్‌టీపీలకు కాకుండా, నేరుగా చెరువుల్లోకి వెళ్లేలా ప్రత్యామ్నాయ బైపాస్ గేట్లు లేదా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల డ్రెయినేజీలపై అదనపు భారం పడదని, రోడ్లపైకి నీరు తన్నే సమస్య తలెత్తదని రంగనాథ్ అభిప్రాయ పడ్డారు. ఈ మేరకు మున్సిపల్, ఇరిగేషన్ మరియు హైడ్రా అధికారులు ఉమ్మడిగా పనులు చేపట్టాలని సూచించారు.

### వర్షాకాలం మొత్తం పనులు సాగాల్సిందే

నగరంలోని వరద కాలువలు, నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి పూడికను (డీ-సిల్టింగ్) యుద్ధప్రతిపాదికన తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తీసే ప్రక్రియ కేవలం ఒక్క రోజుతో ముగిసిపోయేది కాదని, ఈ పనులను వర్షాకాలం ముగిసేవరకు నిరంతరాయంగా సాగించాలని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు నాలాల సామర్థ్యాన్ని పర్యవేక్షించకపోతే హఠాత్తుగా పెద్ద వర్షం పడినప్పుడు మళ్లీ పాత సమస్యే రిపీట్ అవుతుందని హెచ్చరించారు.

### చిన్న సైజు వల్లే ముంపు

ఐటీ కారిడార్ పరిధిలోని ఎన్నికల కమిషన్ (ఈసీ) కార్యాలయ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై మోకాళ్ళ లోతు నీరు చేరడానికి గల ప్రధాన కారణాన్ని అధికారులు గుర్తించారు. అక్కడ నిర్మించిన 'బాక్స్ డ్రెయిన్' సైజు చాలా చిన్నదిగా ఉండటం వల్ల నీటి డిశ్చార్జ్ సామర్థ్యం (నీరు బయటకు పోయే వేగం) బాగా తగ్గిపోయిందని తేల్చారు. పై ప్రాంతాల నుంచి వచ్చే నీటి వేగానికి, పరిమాణానికి తగ్గట్టుగా ఈ కాలువలు లేక పోవడంతోనే వరద నీరంతా రహదారులను ముంచెత్తుతోందని రంగనాథ్ పేర్కొన్నారు. ఈ బాక్స్ డ్రెయిన్ల సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన ఇంజనీరింగ్ మార్పులు చేయాలని స్పష్టం చేశారు.

### త్వరలోనే రంగంలోకి 'మెట్ టీమ్‌లు'..

నగరంలో ఎక్కడ వరద సమస్య తలెత్తినా తక్షణమే స్పందించేందుకు వీలుగా త్వరలోనే ప్రత్యేక 'మెట్ టీమ్‌లు' అందుబాటులోకి రానున్నాయని కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. ఈ ప్రత్యేక బృందాలు అత్యాధునిక యంత్రాలతో నగరంలోని ప్రధాన నాలాలు, కాలువల్లో పేరుకుపోయే మాత్రాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూనే ఉంటాయని చెప్పారు. వరదలు వచ్చినప్పుడు మాత్రమే కాకుండా, సాధారణ రోజుల్లోనూ డీ-సిల్టింగ్ పనులను నిరంతరాయంగా సాగించడం ద్వారా నగర డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### చెరువులు, నాలాల అనుసంధానమే పరిష్కారం

హైదరాబాద్ మహానగరంలో నీటిముంపు సమస్యలను శాశ్వతంగా అరికట్టాలంటే తాత్కాలిక ప్యాచ్ వర్క్‌లు చేస్తే సరిపోదని రంగనాథ్ అభిప్రాయపడ్డారు. నగరంలోని చెరువులు, నాలాలు మరియు స్టార్మ్ వాటర్ డ్రెయిన్లను (వర్షపు నీటి కాలువలు) ఒకదానితో ఒకటి సమగ్రంగా అనుసంధానం చేస్తూ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎగువన ఉన్న చెరువు నిండితే ఆ నీరు క్రమపద్ధతిలో కాలువల ద్వారా దిగువన ఉన్న చెరువులోకి వెళ్లేలా పటిష్టమైన నెట్‌వర్క్ వ్యవస్థను డిజైన్ చేయడమే తమ భవిష్యత్తు లక్ష్యమని వివరించారు.

### అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

రాబోయే రోజుల్లో మరిన్ని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఐటీ కారిడార్ లాంటి కీలక ప్రాంతాలలో నీటి నిల్వలు ఏర్పడకుండా, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను రంగనాథ్ ఆదేశించారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్, ట్రాఫిక్ పోలీస్ మరియు హైడ్రా విభాగాలు ఒకదానితో ఒకటి సమన్వయం చేసుకుంటూ 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. వరద నీటి సరఫరా వ్యవస్థ సమర్థంగా పనిచేసేలా క్షేత్రస్థాయి సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హైడ్రా కమిషనర్ హెచ్చరించారు.

# ఫ్యూచర్ సిటీని రద్దు చేసి తీరుతాం: మాజీ మంత్రి హరీశ్ రావు

- ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి
- ఫార్మా సిటీ పేరుతో సేకరించిన భూముల వినియోగంపై అభ్యంతరం
- అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని పూర్తిగా రద్దు చేస్తామన్న హరీశ్‌రావు
- సీఎం రేవంత్ రెడ్డి విధానాల వల్ల భారీ పెట్టుబడులు కోల్పోయామన్న ఆరోపణ
- ఫార్మా రంగంలో వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్రానికి దూరమయ్యాయని వ్యాఖ్య
- భూముల వినియోగ మార్పు చట్టపరమైన వివాదాలకు దారితీస్తుందన్న మాజీ మంత్రి
- ఫార్మా సిటీ కోసం తాను కూడా భూమి ఇచ్చానని గుర్తుచేసిన హరీశ్
- రైతుల భూములను ఇతర అవసరాలకు వినియోగించడాన్ని వ్యతిరేకిస్తామని స్పష్టం
- జర్నలిస్టులకు స్థలాల కేటాయింపుపై తమకు అభ్యంతరం లేదన్న వ్యాఖ్య
- వివాదాస్పద భూములకే ప్రాధాన్యం ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత



**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**

ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ మరోసారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును పూర్తిగా రద్దు చేస్తామని ప్రకటించారు. రైతుల నుంచి ఒక లక్ష్యంతో సేకరించిన భూములను వేరే అవసరాలకు వినియోగించడం సమంజసం కాదని అన్నారు.ఫార్మా సిటీ కోసం భూములు సేకరించిన సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఫార్మా సిటీని రద్దు చేసి రైతులకు భూములు తిరిగి ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే భూములను వేరే ప్రాజెక్టుల కోసం ఉపయోగించేందుకు ప్రయత్నించడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు.ఫార్మా సిటీ ప్రాజెక్టు నిలిచిపోవడం వల్ల రాష్ట్రం భారీ పెట్టుబడులను కోల్పోయిందని హరీశ్‌రావు ఆరోపించారు. పారిశ్రామికాభివృద్ధికి దోహదపడే అవకాశాలను ప్రభుత్వం సక్రమంగా వినియోగించుకోలేకపోయిందన్నారు. దీంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి నష్టం వాటిల్లిందని వ్యాఖ్యానించారు.ఫార్మా సిటీ కోసం సేకరించిన భూముల వినియోగాన్ని మార్చడం చట్టపరమైన సమస్యలకు దారితీసే అవకాశముందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పలువురు రైతులు కోర్టులను ఆశ్రయించారని, భూముల అంశం న్యాయపరమైన వివాదాల్లో ఉందని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ముందుకెళ్లడం సరైన నిర్ణయం కాదన్నారు.ఫార్మా సిటీ కోసం తాను కూడా భూమి ఇచ్చిన వారిలో ఒకడినని హరీశ్‌రావు తెలిపారు. నిర్దిష్ట ప్రయోజనం కోసం సేకరించిన భూములను రియల్ ఎస్టేట్ లేదా ఇతర అవసరాలకు మళ్లిస్తే ప్రజలు అంగీకరించరని అన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని హరీశ్‌రావు చెప్పారు. అయితే వివాదాలు లేని ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నప్పుడు ఫార్మా సిటీ భూములనే ఎందుకు ఎంపిక చేస్తున్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రైతుల ప్రయోజనాలు, భూహక్కుల పరిరక్షణ విషయంలో బీఆర్ఎస్ రాజీపడదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారని, భవిష్యత్తులో దీనిపై తమ పార్టీ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతుందని తెలిపారు.

# ప్రజావ్యతిరేక విధానాలతో సామాన్యుడిపై భారం

- మమతా బెనర్జీ పార్టీతో విలీనంపై ఎలాంటి చర్చలు జరగలేదన్న వేణుగోపాల్
- 'ఇండియా' కూటమిని మరింత బలోపేతం చేయడంపైనే దృష్టి పెట్టిన ప్రతిపక్షాలు
- మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల వ్యవహారంపై కేంద్రంపై కాంగ్రెస్ ఆగ్రహం
- నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యానికి విఘాతమని విమర్శలు
- ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను బీజేపీలో చేర్చుకోవడం సీట్ల దోపిడీతో సమానమన్న కాంగ్రెస్
- జూన్ నెలాఖరు నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతున్న హస్తం పార్టీ
- ధరల పెరుగుదల, ఆర్థిక సమస్యలపై కేంద్రాన్ని నిలదీయనున్న కాంగ్రెస్
- రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాటం కొనసాగుతుందన్న పార్టీ అధిష్ఠానం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**

కాంగ్రెస్‌లోకి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) విలీనం కానుందంటూ ఇటీవల రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగింది. అయితే ఈ వార్తలను కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా ఖండించింది. అలాంటి ప్రతిపాదన గానీ, చర్చలు గానీ ఎక్కడా జరగలేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. ప్రతిపక్షాల ఐక్యతను మరింత బలోపేతం చేయడమే ప్రస్తుతం తమ ప్రధాన లక్ష్యమని, 'ఇండియా' కూటమి భవిష్యత్ కార్యాచరణపైనే చర్చలు జరిగాయని ఆయన స్పష్టం చేశారు.ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం కీలక సమావేశం నిర్వహించింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇన్‌ఛార్జీలు, పీసీసీ అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీ విస్తరణ, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షీ నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో బీజేపీ మద్దతు ఉన్న అభ్యర్థి నామినేషన్ ఆమోదం పొందడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించే పరిణామమని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఈ అంశాన్ని రాజకీయంగానే కాకుండా న్యాయప రంగానూ సవాలు చేస్తామని కేసీ వేణుగోపాల్ పేర్కొన్నారు.ఇతర పార్టీలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి అధికార పార్టీలో చేర్చుకోవడం ప్రజల తీర్పును అవమానించడమేనని ఆయన ఆరోపించారు. అలాంటి చర్యలు 'సీటు చోరీ'తో సమానమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే ఈ ధోరణికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.జూన్ నెలాఖరు నుంచి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఆందోళన కార్యక్రమాలను ప్రారంభించనుంది. ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఆర్థిక మందగమనం, విద్యా రంగంలో సమస్యలు, పరీక్షల నిర్వహణలో లోపాలు వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది. ఈ ఉద్యమాలు రెండు నుంచి మూడు నెలల పాటు కొనసాగనున్నట్లు కాంగ్రెస్ నాయకత్వం వెల్లడించింది.పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓటర్ల తీర్పును ప్రభావితం చేసే విధంగా రాజకీయాలు సాగుతున్నాయని, 'ఓటు చోరీ'తో పాటు 'సీటు చోరీ' కూడా ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారుతోందని ఆయన వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఇక మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో తన నామినేషన్ తిరస్కరణను సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత మీనాక్షీ నటరాజన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు విచారణ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో పిటిషన్‌ను ఎలా విచారించాలనే అంశంపై సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నలు లేవనెత్తింది.నటరాజన్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, అభ్యర్థి వెల్లడించాల్సిన నేర కేసుల విషయంలో నిబంధనలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. కేవలం సమన్లు జారీ కావడం, శిక్షకు దారితీసే క్రిమినల్ కేసు నమోదు కావడం రెండూ వేర్వేరు అంశాలని ఆయన వివరించారు.మరోవైపు, ఈ పిటిషన్ ప్రతులు తమకు ఇంకా అందలేదని ఎన్నికల సంఘం తరఫున హాజరైన న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అన్ని వాదనలు విన్న సుప్రీంకోర్టు ఈ అంశంపై శుక్రవారం మరింత విచారణ చేపట్టనున్నట్లు వెల్లడించింది.రాజకీయంగా టీఎంసీ విలీనం ప్రచారానికి కాంగ్రెస్ చెక్ పెట్టిన నేపథ్యంలో, ప్రతిపక్ష ఐక్యత, మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల వివాదం, కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ చేపట్టనున్న ఉద్యమాలు జాతీయ రాజకీయాల్లో రాబోయే రోజుల్లో ప్రధాన చర్చగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# కోట్ల పుష్పలత ను సన్మానించిన ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**

ముదిరాజులను బీసీ ఏ లో ఇంప్లిమెంట్ చేయడానికి కోట్ల పుష్పలత కొడంగల్ నుండి బీసీ కమిషనర్ కు పాదయాత్ర చేసి వినతి పత్రం ఇచ్చిన సందర్భంగా మల్కాజ్గిరి ఎంపీ రాజేందర్ ఆమెను సన్మానించారు . కామారెడ్డి డిక్లరేషన్ లో కాంగ్రెస్ ప్రకటించిన విధంగా బీసీఏ రిజర్వేషన్ కల్పించకపోవడంతో ముదిరాజులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కోట్ల పుష్పలత అన్నారు. ముదిరాజులకు అనేక రంగాలలో జరుగుతున్న నష్టాన్ని తెలియజేయటానికి, విద్యారంగంలో ఉపాధి రంగాల్లో రాజకీయాల్లో, ఇలా ప్రతి ఒక్క దాంట్లో ముదిరాజులకు తీవ్ర అన్యాయం జరిగి దోపిడీకి గురవుతున్నారని ఆమె తెలిపారు. ముదిరాజులను బిసి ఏ లో ఇంప్లిమెంట్ చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని, అలాగే సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. పార్లమెంటు మెంబర్ బిజెపి రాజేందర్ తాను చేపట్టిన పాదయాత్ర కు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు.ముదిరాజుల కు జరుగుతున్న అన్యాయం పట్ల ఎంపీ రాజేందర్ కూడా తీవ్రమైన బాధలో ఉన్నారని, ఆయన మాటల్లో అది అర్థమైందన్నారు. ముదిరాజ్ లకు అండగా నిలిచిన ఎంపీ రాజేందర్ కు ప్రతి ఒక్క ముదిరాజ్ తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆమె చెప్పారు.



# ఇసుక ర్యాంపులలో కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్లను అరికట్టాలి

- లారీ యజమానులపై వేధింపులు తక్షణమే ఆపాలి
- అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి – పెద్ద అంబర్‌పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్
- ఈ అంశంపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి, గనులు & భూగర్భ శాఖ మంత్రి గారికి, గనులు & భూగర్భ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గారికి సంఘం తరపున అధికారికంగా ఫిర్యాదు లేఖ సమర్పించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**



ఇసుక ర్యాంపులలో కాంట్రాక్టర్ల అక్రమ వసూళ్లు, లారీ యజమానులపై బెదిరింపులు, అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని వినతి. పై విషయమై తమకు వినయపూర్వకంగా మనవి చేయునది ఏమనగా, తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఇసుక ర్యాంపులలో గ్రామ మహిళా సంఘాల (సొసైటీల) పేరుతో అనుమతులు పొంది, అనంతరం కొందరు బినామీ వ్యక్తులు కాంట్రాక్టులు నిర్వహిస్తూ ఇసుక లారీ యజమానులు, డ్రైవర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు.ఇసుక ర్యాంపులలో లోడింగ్ పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేయడం, ప్రశ్నించిన వారిని బెదిరించడం, డ్రైవర్లపై స్థానిక లేబర్‌తో దాడులు చేయించడం, లారీలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేయడం వంటి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. రోజురోజుకూ ఈ అక్రమ దోపిడీ పెరిగిపోతుండటంతో లారీ యజమానులు తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నారు.

ఎవరైతే టెండర్లు దక్కించుకున్నారో వారే నేరుగా కార్యకలాపాలు నిర్వహించకుండా, బయటి వ్యక్తులకు అప్పగించడం వల్ల పరిస్థితి మరింత దిగజారింది. లోడింగ్ డబ్బులు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించినా, అధికారులకు ఫిర్యాదు చేసినా, అట్టి లారీ యజమానుల వాహనాలను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని TGMDC అధికారులు మరియు కాంట్రాక్టర్లు బెదిరింపులకు దిగుతున్నారు.తేదీ 10-06-2026 న మా రెండు ఇసుక లారీలను ఒకటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వీరపురం ఇసుక ర్యాంప్‌లో, మరొకటి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి ఇసుక ర్యాంప్‌లో కాంట్రాక్టర్లు కలిసి లోడింగ్ చేయకుండా అడ్డుకొని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఈ విషయమై సంబంధిత స్టాక్ యార్డ్ ఇన్‌చార్జి (SRA), PO గారు మరియు TGMDC GM గారికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఇసుక లారీకి TGMDC ద్వారా రూ.15,652/- చెల్లించి ఇసుక తీసుకువెళ్తున్నప్పటికీ, కాంట్రాక్టర్లు అదనంగా అక్రమంగా వసూళ్లు చేస్తున్నారు.

TGMDC ద్వారా వారికి ఇప్పటికే సుమారు రూ.3,500 నుండి రూ.4,000 వరకు చెల్లింపులు అందుతున్నప్పటికీ, ఒక్కో లారీపై అదనంగా రూ.1,500 నుండి రూ.2,700 వరకు వసూలు చేస్తున్నారు. ప్రతి రోజు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 6000 నుండి 8000 వాహనాలు ప్రతి రోజు ఈ ఇసుక ర్యాంప్ ల ద్వారా లోడింగ్ జరుగుతుంది అంటే రోజుకు ఎంత ఆదాయం కాంట్రాక్టర్ల చేతిలోకి వెళ్తుందో చూడండి. ఈ వసూళ్ల వల్లన ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది.

**జిల్లాల వారీగా జరుగుతున్న అక్రమ వసూళ్లు:**

1. జయశంకర్ భూపాలపల్లి జిల్లా
లోడింగ్ – రూ.2,000
కాంట – రూ.200
జేసీబీ ఆపరేటర్ – రూ.200
మొత్తం – రూ.2,400

2. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
లోడింగ్ – రూ.1,600
కాంట – రూ.500
జేసీబీ ఆపరేటర్ – రూ.200
సీరియల్ – రూ.200
మొత్తం – రూ.2,500

3. ములుగు జిల్లా
లోడింగ్ – రూ.1,600
కాంట – రూ.500
జేసీబీ ఆపరేటర్ – రూ.200
మొత్తం – రూ.2,300

4. పెద్దపల్లి జిల్లా
లోడింగ్ – రూ.2,000
JCB ఆపరేటర్ – రూ.200
మొత్తం – రూ.2,200

5. కరీంనగర్ జిల్లా

పోతిరెడ్డిపల్లి, కొండపాక, కొరకల్, ఉటూర్, మల్లారెడ్డిపల్లి ఇసుక ర్యాంపులలో ఒక్కో లారీపై రూ.2,100 అక్రమంగా వసూలు చేస్తున్నారు.అంతేకాకుండా వివిధ జిల్లాలలో విధులు నిర్వహిస్తున్న POలు (ప్రాజెక్టు అధికారులు) మరియు SRAలు (స్టాక్ యార్డ్ ఇన్‌చార్జిలు) లారీ యజమానులు, డ్రైవర్లు ఫోన్ చేసినా స్పందించడం లేదు. కొంతమంది ఫోన్ నంబర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి ఫిర్యాదులను పూర్తిగా పట్టించుకోవడం లేదు. దీంతో కాంట్రాక్టర్ల అక్రమాలకు పరోక్షంగా సహకరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అందువల్ల తమరు దయచేసి:

1. రాష్ట్రవ్యాప్తంగా ఇసుక ర్యాంపులలో జరుగుతున్న అక్రమ వసూళ్లపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి.
2. లారీ యజమానులు, డ్రైవర్లపై బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి.
3. లోడింగ్ పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్లను పూర్తిగా అరికట్టాలి.
4. ఫిర్యాదు చేసిన లారీ యజమానుల వాహనాలకు లోడింగ్ నిరాకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి.
5. బాధ్యతలను నిర్వర్తించకుండా కాంట్రాక్టర్లకు సహకరిస్తున్న సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.
6. ఎక్కువ కాలంగా ఒకే జిల్లాలో పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా PO శ్రీ శంకర్ నాయక్ గారు మరియు జయశంకర్ భూపాలపల్లి జిల్లా PO శ్రీ రామకృష్ణ గారిని బదిలీ చేయాలని పరిశీలించాలి.
7. టెండర్ నిబంధనలకు విరుద్ధంగా బినామీ వ్యక్తులు నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపులపై ప్రత్యేక విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలి.

లారీ యజమానుల సమస్యలను పరిగణనలోకి తీసుకొని తక్షణమే న్యాయం చేయవలసిందిగా వినయపూర్వకంగా ప్రార్థిస్తున్నాము.



అధ్యక్షుడు పోలగోని భాస్కర్ గౌడ్

# నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

- ఎల్బీ నగర్,నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

**ఎల్బీ నగర్, వెలుతురు జూన్ 11:**



వాసవి క్లబ్ కొత్తపేట అధ్యక్షుడు బూశెట్టి సురేష్ ఆధ్వర్యంలో శృంగేరి కాలనీలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో జోనల్ చైర్‌పర్సన్ విజిట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ చైర్‌పర్సన్ కేసీజీఎఫ్ ఎన్వీ సత్యనారాయణ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గోసేవ చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ వాసవి క్లబ్ కొత్తపేట ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. క్లబ్ సభ్యుల సంఖ్య పెరగడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి పచ్చిపులుసు శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీకాకుళం శ్రీనివాస్, పూర్వ జోనల్ చైర్‌పర్సన్ జూలూరు గోపీకృష్ణతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ కొత్తపేట అధ్యక్షుడు బూశెట్టి సురేష్ ఆధ్వర్యంలో శృంగేరి కాలనీలోని శ్రీ బంగారు మైసమ్మ దేవాలయంలో జోనల్ చైర్‌పర్సన్ విజిట్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ చైర్‌పర్సన్ కేసీజీఎఫ్ ఎన్వీ సత్యనారాయణ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గోసేవ చేశారు. అనంతరం ఆయన చేతుల మీదుగా నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గుప్త మాట్లాడుతూ వాసవి క్లబ్ కొత్తపేట ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. క్లబ్ సభ్యుల సంఖ్య పెరగడం ఆనందదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి పచ్చిపులుసు శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీకాకుళం శ్రీనివాస్, పూర్వ జోనల్ చైర్‌పర్సన్ జూలూరు గోపీకృష్ణతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ఐక్యంగా పోరాడుదాం: జూలకంటి రంగారెడ్డి

**హైదరాబాద్, వెలుతురు జూన్ 11:**




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై రైతాంగం ఐక్యంగా పోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐకేఎస్ జాతీయ కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర వైజ్ఞానిక శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం పెరిగిన వ్యవసాయ పెట్టుబడులకు అనుగుణంగా కనీస మద్దతు ధరలు పెంచలేదని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే విధానాలు అమలు చేస్తోందని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 నుంచి వ్యవసాయ ప్రణాళిక ప్రకటించడం నిలిపివేసిందని, పత్తి, వరి పంటలకే అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పంటల వైవిధ్యం దెబ్బతింటోందని అన్నారు. ప్రణాళికాబద్ధమైన వ్యవసాయ విధానాలు లేకపోవడం వల్ల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, వంటనూనెలు, మాంసం, చిరుధాన్యాల ఉత్పత్తుల కోసం దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం 12 లక్షల ఎకరాల్లో సాగవుతున్న ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని 25 లక్షల ఎకరాలకు పెంచాలని రైతులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం తగిన నిధులు కేటాయించడం లేదని విమర్శించారు.




# ఖమ్మం రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక
- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై గురువారం ఎర్రమంజిల్ జలసౌధలో రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకిటి శ్రీహరి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోందని తెలిపారు.సీతమ్మసాగర్, సీతారామ ప్రాజెక్టులతో పాటు జిల్లాలోని అన్ని ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణ పనులను వేగవంతం చేసి రైతులకు త్వరితగతిన ప్రయోజనాలు అందిస్తామని చెప్పారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల విడుదల వంటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి ప్రాజెక్టుల పూర్తి దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.సీతారామ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా భవిష్యత్తును మార్చే కీలక ప్రాజెక్టుగా నిలుస్తుందని, పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు పాత ఆయకట్టును స్థిరీకరించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, సాగునీటి విస్తరణే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రధాన లక్ష్యాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. రైతుల అభ్యున్నతి కోసం అవసరమైన ప్రతి ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# టీఆర్ఎస్ పేరుపై బీఆర్ఎస్...

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) అధికారికంగా ఒక భారీ ఫిర్యాదును సమర్పించింది. సుదీర్ఘ కాలం పాటు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన ఈ పేరును మరెవరికీ కేటాయించవద్దని, ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమే అవుతుందని బీఆర్ఎస్ తన ఫిర్యాదులో గట్టిగా పేర్కొంది.కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన ఫిర్యాదులో బీఆర్ఎస్ పార్టీ కీలకమైన అంశాలను ప్రస్తావించింది. సుమారు రెండు దశాబ్దాల పాటు తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మరియు ఆ తర్వాత తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు తాము 'తెలంగాణ రాష్ట్ర సమితి' (టీఆర్ఎస్) పేరుతోనే ప్రజాదరణ పొందామని గుర్తు చేసింది. జాతీయ రాజకీయాల కోసం తాము పేరును 'భారత రాష్ట్ర సమితి' గా మార్చుకున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఉన్న సామాన్య ప్రజలు, ఓటర్లు ఇప్పటికీ తమను పాత పేరు అయిన 'టీఆర్ఎస్' గానే గుర్తిస్తున్నారని వివరించింది. ఇలాంటి తరుణంలో వేరే వాళ్లకు ఈ పేరు ఇస్తే రాజకీయంగా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.కవిత ప్రకటించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీకి ఈ పేరును కేటాయించవద్దంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి స్వల్ప వ్యవధిలోనే భారీగా అభ్యంతరాలు రావడం జాతీయ స్థాయిలో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం గులాబీ పార్టీ నుంచే కాకుండా వివిధ తెలంగాణ సామాజిక సంఘాలు, ఉద్యమకారుల నుంచి కూడా దాదాపు 700ల వరకు అభ్యంతర లేఖలు ఈసీఐ కార్యాలయానికి చేరాయి. ఈ పేరు తెలంగాణ ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందని, కొత్తగా వచ్చే శక్తులు దీనిని తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకోవడానికి వీల్లేదని ఆయా లేఖల్లో స్పష్టం చేశారు.ఈ రాజకీయ డ్రామాలో మరొక ఊహించని ట్విస్ట్ చోటుచేసుకుంది. కవిత తన కొత్త పార్టీ పేరును అధికారికంగా ప్రకటించడానికి సరిగ్గా ఒక్క రోజు ముందే.. మహారాష్ట్రకు చెందిన కొందరు కీలక నేతలు ఇదే పేరు పోలికలతో కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడం విశేషం. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాకు చెందిన కొందరు సరిహద్దు నేతలు 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామం వచ్చేలా ఒక కొత్త పార్టీని రిజిస్టర్ చేయాలంటూ ఢిల్లీలోని ఈసీఐ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ పరిణామంతో ఈ పేరు వెనుక జాతీయ స్థాయిలో పెద్ద వ్యూహమే నడుస్తోందని స్పష్టమవుతోంది.మహారాష్ట్రకు చెందిన ప్రముఖ సామాజిక, రాజకీయ నాయకుడు దయానంద్ మహాదేవ్.. 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' అనే సరికొత్త పేరుతో పొలిటికల్ పార్టీని రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఈసీఐకి దరఖాస్తు సమర్పించారు. షోలాపూర్ పరిసర ప్రాంతాలలో ఉన్న తెలుగు ప్రజలు, తెలంగాణ వలస కార్మికులను ఆకర్షించేందుకే ఆయన ఈ పేరును ఎంచుకున్నట్లు తెలుస్తోంది. దీనికి కూడా షార్ట్ ఫామ్ టీఆర్ఎస్ అనే వస్తుండటంతో.. కవిత పెట్టిన 'తెలంగాణ రక్షణ సేన'కు మరియు ఈ 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన'కు మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది.భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఏదైనా కొత్త రాజకీయ పార్టీని రిజిస్టర్ చేసేటప్పుడు.. ఆ పేరుపై ప్రజల నుంచి లేదా ఇతర రాజకీయ పార్టీల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించేందుకు ప్రముఖ దినపత్రికల్లో బహిరంగ నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. మహారాష్ట్ర నేత దయానంద్ మహాదేవ్ నేతృత్వంలోని 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' గ్రూప్ ఈ నిబంధనల ప్రకారం పత్రికల్లో నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ గడువు ముగిసేలోపే బీఆర్ఎస్ పార్టీ రంగంలోకి దిగి తన తీవ్రమైన అభ్యంతరాన్ని అధికారికంగా రికార్డు చేసింది.కవిత ప్రకటించిన 'తెలంగాణ రక్షణ సేన', షోలాపూర్ నేత దరఖాస్తు చేసిన 'తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన' వివాదం నడుస్తుండగానే.. ఈ రచ్చలోకి మూడో పార్టీ కూడా ప్రవేశించింది. ఇప్పటికే రిజిస్టర్ అయి ఉన్న 'తెలంగాణ రాజ్య సమితి' పార్టీ కూడా ఈ పేరు వాడకంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమ పార్టీ పేరు కూడా 'టీఆర్ఎస్' అని పిలవబడుతుందని, కాబట్టి కవిత కానీ, మహారాష్ట్ర నేతలు కానీ ఈ పేరును పోలిన పేర్లతో కొత్త పార్టీలు పెట్టడానికి వీల్లేదని వారు ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. దీంతో ఈ వివాదం కాస్తా త్రిముఖ పోరుగా మారిపోయింది.ఒకవైపు తెలంగాణ సెంటిమెంట్‌ను కాపాడుకోవాలని చూస్తున్న బీఆర్ఎస్, మరోవైపు కొత్తగా పార్టీ పెట్టి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్న కవిత, ఇంకోవైపు మహారాష్ట్ర నుంచి వచ్చిన దరఖాస్తులు.. వీటన్నింటి మధ్య కేంద్ర ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈసీఐ సాధారణంగా ఒకే రకమైన ఉచ్చారణ లేదా సంక్షిప్త నామాలు ఉన్న పేర్లను కొత్త పార్టీలకు కేటాయించడానికి మొగ్గు చూపదు. మరి ఈ నియమం ప్రకారం 'టీఆర్ఎస్' అనే పేరును హోల్డ్ లో పెడుతుందా లేదా ఎవరికైనా కేటాయిస్తుందా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# రాష్ట్ర ప్రాజెక్టులకు...

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్–అమరావతి–బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు.వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే అవసరమైన భూసేకరణ పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత లబ్ది చేకూరుతుందని అన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం–2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుందని ప్రస్తావించారు.

# హుస్నాబాద్ బస్టాండ్‌ను షాపింగ్ మాల్‌గా అభివృద్ధి చేస్తాం: మంత్రి పొన్నం

- టూరిజం, ఇండస్ట్రియల్ కారిడార్‌తో కొత్త అవకాశాలు
- రోజుకు 35 వేల మంది ప్రయాణికుల రాకపోకలు
- రెవెన్యూ పరంగా ముందంజలో హుస్నాబాద్ బస్టాండ్
- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన
- పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**హుస్నాబాద్ వెలుతురు జూన్ 11:**

రాబోయే 2027 గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నాలుగు జిల్లా కేంద్రాలకు ఫోర్‌లైన్ రోడ్డు అనుసంధానం కలిగిన హుస్నాబాద్‌ను మరింత అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని, పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు.గురువారం హుస్నాబాద్ బస్టాండ్‌ను ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని ప్రయాణికులతో మాట్లాడి బస్సుల రాకపోకలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ, టూరిజం రంగం, ఇండస్ట్రియల్ కారిడార్ ద్వారా హుస్నాబాద్ అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రయాణికుల సంఖ్య, బస్టాండ్ ఆదాయం పరంగా హుస్నాబాద్ ముందంజలో ఉందని తెలిపారు.ప్రతిరోజూ సుమారు 35 వేల మంది ప్రయాణికులు హుస్నాబాద్ బస్టాండ్‌ను వినియోగిస్తున్నారని చెప్పారు.

బస్టాండ్‌ను ఆధునిక వసతులతో కూడిన పెద్ద షాపింగ్ మాల్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నల్లగొండ...

(మొదటి పేజీ తరువాయి)

గురువారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవర్, ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత జిల్లా అధికారులతో ముఖ్యమంత్రి రాక ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న హ్యాం రోడ్ల పైలాన్, బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం,బహిరంగ సభకు ఏర్పాట్లు, ఇతర ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. హ్యాం రోడ్లతోపాటు, మరి కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చే ఇక్కడ నుండే శంకుస్థాపనలు నిర్వహించే విషయమై సమావేశంలో మంత్రి అధికారులతో చర్చించారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి తో ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దర్శనం చేయించి ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయాన్ని ఆధునికరించేందుకు చర్యలు తీసుకుంటున్నందున అవకాశం ఉంటే దేవాలయ ఆధునికరణ పనులకు కూడా ఎల్లమ్మ తల్లి దేవాలయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి తెలిపారు. శిలాఫలకం, ఇతర ఏర్పాట్లపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి కేంద్రీకరించాలని కొరారు. అనంతరం హ్యాం రోడ్ల శంకుస్థాపన, బహిరంగ సభకు హాజరయ్యే విధంగా ప్రాథమికంగా ఏర్పాట్లు చేసేలా మంత్రి అధికారులకు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. అంతేకాక సభకు హాజరయ్యే ప్రజల కోసం టెంట్లు, కుర్చీలు, తాగునీరు, ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయాలని, ఏర్పాట్లలో ఎక్కడ లోపం లేకుండా చూడాలన్నారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ , జిల్లా అధికారులతో కలిసి గురువారమే కనగల్ వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభకు,హ్యాం రోడ్ల శంకుస్థాపనకు స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, అలాగే పైలాన్ ఏర్పాటు చేసే స్థలం , బందోబస్తుతో సహా పరిశీలించి నట్లు వెల్లడించారు.<

ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై .అశోక్ రెడ్డి, ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి,డిఈ గణేష్, జెడ్పిసిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఈ సమావేశంలో ఉన్నారు.

# ఎస్ఐఆర్‌పై అపోహలు సృష్టిస్తున్నారు...

- ఓటు హక్కు ఉన్న ప్రాంతంలోనే ఓటు వినియోగం లక్ష్యం
- కేరళ, కర్ణాటక, తెలంగాణలో కొనసాగుతున్న ప్రక్రియ
- ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతున్న భాజపా
- రైతులు, విద్యార్థులను కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసం చేశాయి
- ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని పిలుపు
- ఎస్ఐఆర్ అమలులో పారదర్శకత పాటించాలని డిమాండ్
- భాజపా జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో నేతల వ్యాఖ్యలు

**కుకునూర్‌పల్లి వెలుతురు జూన్ 11:**

సిద్దిపేట జిల్లా కుకునూర్‌పల్లి మండలం మాత్‌పల్లిలో నిర్వహిస్తున్న భాజపా జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)పై ప్రతిపక్ష పార్టీలు ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. గతంలో ఇదే ప్రక్రియను నిర్వహించినప్పుడు మద్దతు తెలిపిన పార్టీలు ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం భాజపాపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చేందుకు చేపడుతున్న చర్య అని ఆయన పేర్కొన్నారు. ఓటు హక్కు కలిగిన వ్యక్తి తాను నివసించే ప్రాంతంలోనే ఓటు వినియోగించుకునే విధంగా ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడమే దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు. కేరళ, కర్ణాటక, తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు.తెలంగాణలో భాజపా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతుండటంతో ప్రజల ఆదరణ పెరుగుతోందని రామచందర్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచాయని ఆరోపించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఈ రెండు పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ, ఓటర్ల జాబితాల్లోని లోపాలను సరిదిద్దడం, అర్హులైన ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం కోసమే ఎస్ఐఆర్ ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. దీనిని రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు.ఎస్ఐఆర్ అమలులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. ప్రజలందరికీ పూర్తి సమాచారం అందేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాల ప్రక్షాళన ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.జిల్లా స్థాయి శిక్షణ తరగతుల్లో పార్టీ బలోపేతం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, భవిష్యత్ రాజకీయ కార్యాచరణ తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# ఫోన్ దొంగతనాలతో బ్యాంక్ ఖాతాలకు కన్నం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

**సూర్యాపేట, వెలుతురు జూన్ 11:**

బస్సుల్లో ప్రయాణించే వారి మొబైల్ ఫోన్లను దొంగిలించి, అందులోని యూపీఐ, మనీ యాప్‌ల పిన్ నంబర్లను గుర్తించి డబ్బులు కాజేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సూర్యాపేట జిల్లా సీసీఎస్, తుంగతుర్తి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.2.70 లక్షల నగదు, 27 స్మార్ట్‌ఫోన్లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ నరసింహ కేసు వివరాలను వెల్లడించారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన రైతు ఉప్పల ఉప్పలయ్య మొబైల్ ఫోన్‌ను బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో దొంగిలించిన నిందితులు, ఫోన్‌లోని మనీ యాప్ ద్వారా రూ.1.80 లక్షలు కాజేశారు. అలాగే తుంగతుర్తికి చెందిన వ్యాపారి దుగ్యాల వెంకటేశ్వరరావు ఫోన్ దొంగిలించి రూ.90 వేలకుపైగా నగదును ఇతర ఖాతాలకు బదిలీ చేశారు. దర్యాప్తులో భాగంగా తుంగతుర్తి బస్టాండ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా, నంద్యాల జిల్లాకు చెందిన పాముల రాము అలియాస్ ఎరుకల రాము మరియు ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు సాధారణ పిన్ నంబర్లతో ఉన్న ఫోన్లను లక్ష్యంగా చేసుకుని, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యాప్‌ల ద్వారా డబ్బులు బదిలీ చేసి నగదుగా మార్చుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు, యూపీఐ యాప్‌లకు బలమైన పాస్‌వర్డ్‌లు, పిన్ నంబర్లు ఉపయోగించాలని ఎస్పీ సూచించారు.




# తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**తెలంగాణ అంబేద్కర్ సంఘం**

**హైదరాబాద్ : వెలుతురు జూన్ 11:**

తెలంగాణ ఉద్యమంలో పాల్గొని రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన నిజమైన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పుల శ్రీహరి డిమాండ్ చేశారు.తెలంగాణ ఉద్యమ సమయంలో ఇళ్లు, కుటుంబాలను వదిలి ఉద్యమంలో పాల్గొన్న అనేక మంది కార్యకర్తలు రాష్ట్ర ఏర్పాటు అనంతరం కూడా ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. కొంతమంది మాత్రమే ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అయినప్పటికీ, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సాధారణ కార్యకర్తలకు తగిన గుర్తింపు, ప్రయోజనాలు అందలేదని విమర్శించారు.

ఉద్యమకారులకు బస్సులు, రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ఇల్లు నిర్మించుకునేందుకు 250 గజాల స్థలంతో పాటు ఆర్థిక సహాయం అందించాలని, ఉద్యమకారుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉద్యమకారుల కమిటీకి, అనంతరం ముఖ్యమంత్రికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడించారు.

# హైదరాబాద్‌లో బొగ్గు మరియు లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై విజయవంతంగా నిర్వహించిన రోడ్‌షో

**హైదరాబాద్ వెలుతురు జూన్ 11:**



బొగ్గు మరియు లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్వహించిన ముఖ్యమైన రోడ్‌షో నేడు హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో పరిశ్రమల ప్రముఖులు, సాంకేతిక సంస్థలు, పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు, బొగ్గు మరియు లిగ్నైట్ కంపెనీలు, పరిశ్రమల సంఘాలు, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు పాల్గొన్నారు.దేశంలో బొగ్గు గ్యాసిఫికేషన్‌కు వేగం తీసుకురావడం, సమృద్ధిగా లభ్యమయ్యే బొగ్గు వనరులను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా పరిశుభ్రమైన వినియోగాన్ని ప్రోత్సహించాలనే భారత ప్రభుత్వ దృష్టిని ఈ రోడ్‌షో ప్రతిబింబించింది. పెట్టుబడి అవకాశాలు, విధానపరమైన మద్దతు, సాంకేతిక పురోగతి, అమలు వ్యూహాలు మరియు దేశంలో బలమైన బొగ్గు గ్యాసిఫికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేసే మార్గాలపై విస్తృత చర్చలు జరిగాయి.ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా, కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే గౌరవ అతిథిగా హాజరయ్యారు. బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్, అదనపు కార్యదర్శి శ్రీ సనోజ్ కుమార్ ఝా మరియు ఇతర సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు.రోడ్‌షోలో ముఖ్య ప్రసంగం చేసిన శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశం దాదాపు 400 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను కలిగి ఉందని, ఇది ప్రపంచంలో ఐదవ అతిపెద్ద బొగ్గు నిల్వలని తెలిపారు. రాబోయే అనేక దశాబ్దాలపాటు దేశ అవసరాలకు సరిపడా బొగ్గు లభ్యత ఉందన్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారు మరియు వినియోగదారుగా ఉన్నదని, దేశ విద్యుత్ ఉత్పత్తిలో సుమారు 70 శాతం బొగ్గుపైనే ఆధారపడి ఉందని, లక్షలాది మంది జీవనోపాధి ఈ రంగంతో ముడిపడి ఉందని పేర్కొన్నారు.దేశానికి సమృద్ధిగా లభ్యమయ్యే ఈ వనరును మరింత సమర్థవంతంగా వినియోగించాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తూ, బొగ్గు గ్యాసిఫికేషన్‌ను భారత ఇంధన మరియు పారిశ్రామిక భవిష్యత్తుకు పరివర్తనాత్మక అవకాశంగా అభివర్ణించారు.భారత్‌కు విస్తారమైన బొగ్గు నిల్వలు ఉన్నప్పటికీ, మెథనాల్, అమ్మోనియా, ఎరువుల ముడి పదార్థాలు మరియు అనేక కీలక పారిశ్రామిక రసాయనాల దిగుమతులపై దేశం ఇంకా అధికంగా ఆధారపడుతోందని, దీనివల్ల ప్రతి సంవత్సరం భారీ విదేశీ మారకద్రవ్యం వ్యయం అవుతోందని ఆయన తెలిపారు.దేశీయ బొగ్గును విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం ద్వారా ఇంధన భద్రతను బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం మరియు ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం కోసం బొగ్గు గ్యాసిఫికేషన్ వ్యూహాత్మక మార్గమని ఆయన పేర్కొన్నారు.పారదర్శకత మరియు సంప్రదింపులకు ప్రాధాన్యతనిస్తూ, డ్రాఫ్ట్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (RFP)ను ఇప్పటికే ప్రజల సూచనలు, అభిప్రాయాల కోసం ప్రజా డొమైన్‌లో ఉంచినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను మరింత బలోపేతం చేసేందుకు పరిశ్రమల ప్రతినిధులు తమ విలువైన సూచనలు అందించాలని ఆయన ఆహ్వానించారు.ఉపరితల బొగ్గు/లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకానికి సంబంధించి కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన మొత్తం ₹46,000 కోట్ల సంయుక్త పథకం భారతదేశ ఇంధన మరియు పారిశ్రామిక ప్రయాణంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం దేశవ్యాప్తంగా భారీ స్థాయి గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు కొత్త ఊపునిస్తుందని చెప్పారు.పెట్టుబడిదారులు మరియు సాంకేతిక సంస్థలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం, వ్యాపార సౌలభ్యాన్ని మరింత మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పారదర్శకత, జవాబుదారీతనం మరియు పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు బొగ్గు గ్యాసిఫికేషన్ కార్యక్రమ విజయానికి కీలకమని ఆయన పునరుద్ఘాటించారు.భారత్ ప్రపంచంలోనే అత్యంత ఆశాజనకమైన బొగ్గు గ్యాసిఫికేషన్ పెట్టుబడి గమ్యస్థానాలలో ఒకటిగా అవతరించేందుకు సిద్ధంగా ఉందని విశ్వాసం వ్యక్తం చేసిన ఆయన, “మనకు సమృద్ధిగా బొగ్గు ఉంది. మనకు విధానపరమైన మద్దతు ఉంది. మనకు నిబద్ధత ఉంది. బొగ్గు గ్యాసిఫికేషన్ భారత పారిశ్రామిక వృద్ధికి, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి కొత్త చోదకశక్తిగా మారుతుంది” అని అన్నారు.






# భూటాన్‌లో బంగారు పతకం సాధించిన బిందు రాథోడ్‌కు ఘన సన్మానం

- జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ చేతుల మీదుగా సత్కారం
- టీబీఈఎస్ఎస్ నాయకుల అభినందనలు

**జహీరాబాద్ వెలుతురు జూన్ 11:**





భూటాన్‌లో జరిగిన అంతర్జాతీయ అట్యా-పట్యా ఏసియన్ ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించి తెలంగాణ రాష్ట్రానికి, సంగారెడ్డి జిల్లాకు గర్వకారణంగా నిలిచిన జహీరాబాద్ హోతి (కె) రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని బిందు రాథోడ్‌కు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ఘనంగా సన్మానం చేశారు.గురువారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ బిందు రాథోడ్‌ను అభినందించి నోట్‌బుక్స్ అందజేశారు. క్రీడల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం జిల్లాకు గర్వకారణమని కొనియాడారు.ఈ సందర్భంగా టీబీఈఎస్ఎస్ (TBESS) తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకులు బిందు రాథోడ్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో టీబీఈఎస్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. తులసిరామ్ రాథోడ్, హీరాలాల్ చవ్వాణ్, జైసింగ్ చవ్వాణ్, పాఠశాల ప్రిన్సిపాల్ విట్టల్, గోర్ సేన నాయకులు జగన్ తదితరులు పాల్గొన్నారు.వక్తలు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం, సమాజం మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. భవిష్యత్తులో బిందు రాథోడ్ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్...



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో ఎన్ని తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి, శిథిలావస్థ, పాలనకు అనువుగా లేని భవనాలు వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదు. ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి స్పష్టం చేశారు.మొదటి దశలో అద్దె భావనాలల్లో, శిథిలావస్థలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టడానికి నివేదికలు అందించాలని రెవెన్యూ సెక్రటరీని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి నిర్మాణ పనులు వీలైనత త్వరితగతిన ప్రారంభించేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామని చెప్పారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా, ప్రణాళికాబద్ధత లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చే విధంగా రూపొందించిందని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు.స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖలో అత్యాధునిక వసతులతో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు.ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్-మల్కాజిగిరి, పఠాన్ చెరువు, కోహెడ లలో భవనాలకు శంకుస్థాపన చేసుకొని పనులు కూడా ప్రారంభించుకున్నామని తెలిపారు.జిల్లా నియోజక వర్గ కేంద్రాలల్లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సంఖ్యకు అనుగుణంగా భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండు డిఐజి, నాలుగు జిల్లా సబ్ రిజిస్ట్రార్, 52 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నాలుగు వేల చదరపు అడుగుల నుంచి పది వేల చదరపు అడుగులు ఉండేలా ఒకే నమూనాలో నిర్మించాబోతున్నామని తెలిపారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కోసం అవసరమైన స్థలాలను గుర్తించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతుందని త్వరలోనే క్యూర్ పరిధిలోని జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించబోతున్నామని వెల్లడించారు.